పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# భూదస్తావేజుల నకిలీ ముఠా గుట్టురట్టు..!

-మల్కాజిగిరిలో పట్టుబడిన ఫోర్జరీ ముఠా..

- ఫోర్జరీ పత్రాలు, నకిలీ స్టాంపులు స్వాధీనం, 9 కత్తులు సీజ్..!
- ఇద్దరు అరెస్ట్.. మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు చర్యలు..
- నకిలీ సేల్ డీడ్లు, బాండ్ పేపర్ల తయారీ..!
- అసలు యజమానుల వివరాల సేకరణలో పోలీసులు..
- కంప్యూటర్, ప్రింటర్, నకిలీ సీల్స్ స్వాధీనం..!
- భూముల వివరాలపై పోలీసుల లోతైన దర్యాప్తు..

-5లో



## 2018లోనే కేంద్రం యాదాద్రికి బొగ్గు కేటాయించింది

- ప్రజలపై వేస్తున్న రూ.5,420 కోట్ల భారం గురించి ఎందుకు ఒక్క మాటా మాట్లాడలేదు?
- భట్టిని ప్రశ్నించిన హరీశ్‌రావు

-6లో

మూసీ తీరంలో..! ఓంకారేశ్వర ఆలయానికి

# రూ.948.65 కోట్లు..!

ఆధ్యాత్మిక వైభవానికి మహా ప్రణాళిక.
ఆరు లేన్ల రహదారికి మరో రూ.159.62 కోట్లు..

- మొత్తం రూ.1,108.27 కోట్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా అనుమతి..
- మంచిరేవులలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయం..!
- అనుసంధాన రహదారి అభివృద్ధికి భారీ నిధులు కేటాయింపు..
- ఆలయ సముదాయానికే రూ.948.65 కోట్లు..!
- ప్రధాన ఆలయంతో పాటు వీరభద్ర స్వామి--భద్రకాళి, లలితా మహా త్రిపురసుందరి..
- బాల గణపతి, బాల సుబ్రహ్మణ్య ఆలయాలతో నదీ ఒడ్డున మహా పుణ్యక్షేత్రం..
- ఆలయ నిర్మాణ శిల్పానికే రూ.598.98 కోట్లు..
- సివిల్, స్ట్రక్చరల్, ఎంఈపి తదితర పనులకు మరో రూ.349.67 కోట్లు..
- 100 అడుగుల వెడల్పుతో ఆరు లేన్ల రహదారి..
- ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ మీదుగా ఆలయానికి రోడ్డు నిర్మాణం..
- సుమారు 2.50 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.159.62 కోట్లు..
- డ్రైనేజీ, కల్వర్టులు, లైటింగ్, రోడ్ సేఫ్టీ, ఇతర మౌలిక వసతులు ఇందులో భాగమే..
- మూసీ పునరుజ్జీవనంతో ఆధ్యాత్మిక పర్యాటకానికి అభివృద్ధి దిశగా..

-4లో



## బొగ్గు సరఫరా లేకుండా ప్లాంటు ఎలా నిర్మిస్తారు?

భారాస ప్రభుత్వ తప్పిదాలతో యాదాద్రి ప్లాంటు ఆలస్యం
విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించబోతు న్నామనే ప్రచారంలో వాస్తవం లేదు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క -5లో





హైదరాబాద్, పెన్ పవర్, అక్టోబర్ 7:

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయం అభివృద్ధికి రూ.948.65 కోట్లు, ఆలయాన్ని అనుసంధానించే 30 మీటర్ల (100 అడుగుల) వెడల్పుతో ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.159.62 కోట్లు కలిపి మొత్తం రూ.1,108.27 కోట్లకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్) శాఖ G.O.Rt.No.928ను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 07-10-2026 తేదీలో (బుధవారం) వెలువడ్డాయి.. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీ ఆగస్టు 29న పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈ ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది.. ప్రధాన ఓంకారేశ్వర స్వామి ఆలయంతో పాటు వీరభద్ర-భద్రకాళి, లలితా మహా త్రిపురసుందరీ దేవి, బాల గణపతి, బాల సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలు నిర్మిస్తారు. మహా మండపం, నంది మండపం, ప్రాకారాలు, రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణితో పాటు భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేస్తారు..



# మూసీ తీరంలో..!
# ఓంకారేశ్వర ఆలయానికి రూ.948.65 కోట్లు..!



## ఆధ్యాత్మిక వైభవానికి మహా ప్రణాళిక. ఆరు లేన్ల రహదారికి మరో రూ.159.62 కోట్లు..

### నిర్మాణ వ్యయంలో ప్రధాన భాగం.. ఆలయ వాస్తు పనులకే..

రూ.948.65 కోట్ల ఆలయ సముదాయ వ్యయంలో రూ.598.98 కోట్లు ఆలయ ఆర్కిటెక్చరల్ పనులకు కేటాయించారు.. అలాగే రూ. 349.67 కోట్లు సివిల్, స్ట్రక్చరల్ పనులు, ఎంఈపి (మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్), ఇతర అనుబంధ సదుపాయాల కోసం ప్రతిపాదించారు..దీంతో ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలో ఆలయ నిర్మాణ శిల్పం, నిర్మాణ నాణ్యతతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, అనుబంధ సౌకర్యాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు జీవో స్పష్టం చేస్తోంది..

### ఆలయ సముదాయానికి రూ.948.65 కోట్లు..!

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంచిరేవులలో ప్రతిపాదిత శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయం కేవలం ప్రధాన ఆలయ నిర్మాణానికే పరిమితం కాకుండా విస్తృతమైన ఆధ్యాత్మిక--సాంస్కృతిక సముదాయంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో ప్రధాన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయం, ఉప ఆలయాలు, వివిధ మంటపాలు, గోపురాలు, యాగశాల, పుష్కరిణి, శివుని ప్రతిమ తదితర నిర్మాణాలు ఉండనున్నాయి.. ప్రభుత్వ జీవోలో పేర్కొన్న వివరాల ప్రకారం ఆలయ సముదాయంలో శ్రీ వీరభద్ర--భద్రకాళి ఆలయం, శ్రీ లలితా మహా త్రిపురసుందరి దేవి ఆలయం, శ్రీ బాల గణపతి స్వామి ఆలయం, శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వంటి ఉప ఆలయాలతో పాటు మహా మండపం, నంది మండపం, ప్రాకారాలు, రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణి, ఐకానిక్ శివ విగ్రహం వంటి అనుబంధ ఆధ్యాత్మిక మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికా రూపొందించారు..

### రోడ్డు పనుల్లో ఇవీ భాగమే..

రూ.159.62 కోట్ల రహదారి వ్యయంలో కేవలం రోడ్డు వేయడం మాత్రమే కాకుండా పేవ్‌మెంట్, డ్రైనేజీ, రిటైనింగ్ రక్షణ పనులు, కల్వర్టులు, లైటింగ్, రోడ్ సేఫ్టీ పనులు, ఇతర అనుబంధ మౌలిక సదుపాయాలు కూడా ఉంటాయని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.. ఈ పనులను (ఐఆర్‌సి, ఎంఓఆర్‌టిహెచ్) నిర్దేశించిన రహదారి నిర్మాణ, నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది..

### 2.50 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల రహదారి..

ఆలయ సముదాయానికి సులభంగా చేరుకునేలా ప్రత్యేక రహదారి నిర్మాణానికీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ వరకు, మంచిరేవులలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయాన్ని అనుసంధానిస్తూ 30 మీటర్ల (100 అడుగుల) వెడల్పుతో ఆరు లేన్ల హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్ రోడ్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు..ఈ ప్రతిపాదిత రహదారి పొడవు సుమారు 2.50 కిలోమీటర్లుగా పేర్కొన్నారు..ఈ మార్గంలో గ్రేహౌండ్స్ భూములు, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సమీప ప్రాంతాలు ఉండటంతో పాటు, మొత్తం రహదారిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ రోడ్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది..

- మొత్తం రూ.1,108.27 కోట్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా అనుమతి..
- మంచిరేవులలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయం..!
- అనుసంధాన రహదారి అభివృద్ధికి భారీ నిధులు కేటాయింపు..
- ఆలయ సముదాయానికే రూ.948.65 కోట్లు..!
- ప్రధాన ఆలయంతో పాటు వీరభద్ర స్వామి--భద్రకాళి, లలితా మహా త్రిపురసుందరి..
- బాల గణపతి, బాల సుబ్రహ్మణ్య ఆలయాలతో నదీ ఒడ్డున మహా పుణ్యక్షేత్రం..
- సివిల్, స్ట్రక్చరల్, ఎంఈపి తదితర పనులకు మరో రూ.349.67 కోట్లు..
- 100 అడుగుల వెడల్పుతో ఆరు లేన్ల రహదారి..
- ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ మీదుగా ఆలయానికి రోడ్డు నిర్మాణం..
- సుమారు 2.50 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.159.62 కోట్లు..
- డ్రైనేజీ, కల్వర్టులు, లైటింగ్, రోడ్ సేఫ్టీ, ఇతర మౌలిక వసతులు ఇందులో భాగమే..
- మూసీ పునరుజ్జీవనంతో ఆధ్యాత్మిక పర్యాటకానికి అభివృద్ధి దిశగా..

### మూసీ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా..

మూసీ నది పునరుజ్జీవనం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా,ఈ ప్రాజెక్టును ప్రభుత్వం కేవలం నది అభివృద్ధి కార్యక్రమంగా కాకుండా సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక, పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధితో అనుసంధానించే విస్తృత ప్రాజెక్టుగా ముందుకు తీసుకెళు_న్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో మంచిరేవుల ఆలయ సముదాయం ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతోందని చెపుతున్నారు..మొత్తానికి, మంచిరేవులలో ఆధ్యాత్మిక కేంద్రం అభివృద్ధి, ఆలయ నిర్మాణ సముదాయం, భక్తుల సౌకర్యాలు, అనుబంధ మౌలిక వసతులు, అలాగే ఆలయానికి చేరుకునే భారీ ఆరు లేన్ల రహదారి.. ఈ రెండు కీలక అంశాలను కలిపి ప్రభుత్వం రూ.1,108.27 కోట్ల భారీ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది.. ఇది పూర్తయితే మంచిరేవుల ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా, రహదారి కనెక్టివిటీ, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కొత్తదనాన్నిచ్చే అవకాశముందని భావిస్తున్నారు..



- ఫోర్జరీ పత్రాలు, నకిలీ స్టాంపులు స్వాధీనం, 9 కత్తులు సీజ్..!
- ఇద్దరు అరెస్ట్.. మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు చర్యలు..
- నకిలీ సేల్ డీడ్లు, బాండ్ పేపర్ల తయారీ..!
- అసలు యజమానుల వివరాల సేకరణలో పోలీసులు..
- కంప్యూటర్, ప్రింటర్, నకిలీ సీల్స్ స్వాధీనం..!
- భూముల వివరాలపై పోలీసుల లోతైన దర్యాప్తు..




# భూదస్తావేజుల నకిలీ ముఠా గుట్టురట్టు..!

## మల్కాజిగిరిలో పట్టుబడిన ఫోర్జరీ ముఠా..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 7:** భూముల వివాదాలను ఆసరాగా చేసుకుని నకిలీ పత్రాలు సృష్టిస్తూ అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న భూదస్తావేజుల ఫోర్జరీ ముఠాను మల్కాజిగిరి స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్వోటి), మల్కాజిగిరి పోలీసులు కలిసి ఛేదించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 6న మౌలాలిలోని చందాబాగ్‌లో నిర్వహించిన తనిఖీల్లో నకిలీ భూ పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు, నకిలీ రెవెన్యూ స్టాంపులు, వివిధ రబ్బర్ స్టాంపులతో పాటు 9 కత్తులను స్వాధీనం చేసుకున్నారు.. ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.. మల్కాజిగిరి పోలీసులు తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. క్రైమ్ నంబర్ 748/2026 కింద మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులుగా మౌలాలికి చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ మహ్మద్ ఖాజా పాషా, లాలాగూడకు చెందిన మహ్మద్ జుల్ఫిఖర్ అలియాస్ చందు ఉండగా, అల్వాల్‌కు చెందిన వినోద్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.. కాగా ఖాజా పాషా నివాసంలో 9 కత్తులు, నకిలీ భూమి సంబంధిత పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు, నకిలీ రెవెన్యూ స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.. జుల్ఫిఖర్ అలియాస్ చందు ఇంటి నుంచి వివిధ రకాల నకిలీ భూ పత్రాలు, రబ్బర్ స్టాంపులు, ఖాళీ బాండ్ పేపర్లు, ఒక డెల్ కంప్యూటర్, ఒక క్యానన్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు..







## వివిధ పేర్లతో 22 స్టాంపులు సీల్స్..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయం, అదనపు ఐజీ స్టాంప్స్ కార్యాలయం తదితర పేర్లతో ఉన్న మొత్తం 22 స్టాంపులు, సీల్స్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.. ఖాజా పాషా వివాదాస్పద, నిర్లక్ష్యానికి గురైన భూములను గుర్తించి, అసలు యజమానులు, వారి వారసుల వివరాలు సేకరించేవాడు. అనంతరం టైటిల్, రెవెన్యూ రికార్డులు, లీగల్-హెయిర్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు తదితర ధ్రువపత్రాల ప్రతులను సేకరించేవాడని పేర్కొన్నారు.. ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని జుల్ఫిఖర్ అలియాస్ చందుతో కలిసి నకిలీ విక్రయ పత్రాలు, బాండ్ పేపర్లు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులు వంటి గుర్తింపు పత్రాలు తయారు చేసి, అసలు యజమానులు, వారి వారసుల పేరుతో నకిలీ వ్యక్తులను ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.. ఈ ముఠా లక్ష్యం వివాదాస్పద భూములపై తప్పుడు హక్కు పత్రాలు సృష్టించి, విక్రయం, రిజిస్ట్రేషన్, తనఖా పెట్టి ద్వారా అక్రమంగా ఆర్థిక లాభం పొందడమేనని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు.. తద్వారా అసలు యజమానులు, భూములు కొనుగోలు చేయబోయే వ్యక్తులకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు..

## జుల్ఫిఖర్ విచారణతో.. వినోద్ కుమార్ పాత్ర..

ఖాజా పాషా కీసర పోలీస్‌స్టేషన్‌లో గతంలో 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు, భూ వివాదాలు, అక్రమ భూ లావాదేవీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.. జుల్ఫిఖర్‌ను విచారించిన అనంతరం నకిలీ భూ పత్రాల తయారీలో అల్వాల్‌కు చెందిన వినోద్‌కుమార్ పాత్ర ఉన్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు.. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయని వెల్లడించారు.. స్వాధీనం చేసుకున్న పత్రాలను పరిశీలించి, సంబంధిత భూములు, ఏ సర్వే నెంబర్లలో ఉన్నాయో, నకిలీ పత్రాలను ఎవరు తయారు చేశారు అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతుంది.. భూమి కొనుగోలు చేసే ముందు టైటిల్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), రిజిస్ట్రేషన్ చరిత్ర, రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు, కోర్టు వివాదాలు, లేఅవుట్ అనుమతులు, భౌతిక స్వాధీనం తదితర అంశాలను స్వతంత్రంగా ధృవీకరించుకుని, న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని మల్కాజిగిరి పోలీసులు ప్రజలకు సూచించారు.




# బొగ్గు సరఫరా లేకుండా ప్లాంటు ఎలా నిర్మిస్తారు?

**హైదరాబాద్ పెన్ పవర్:** బొగ్గు సరఫరా లేకుండా యాదాద్రి థర్మల్ ప్లాంటు ఎలా నిర్మిస్తారని, గత భారాస ప్రభుత్వం చేసిన తప్పిదాలతోనే యాదాద్రి ప్లాంటు నిర్మాణం ఆలస్యమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని సరిచేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ఇక నుంచి వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానం ఇస్తామని భట్టి ప్రకటించారు. బుధవారం విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి, విద్యుత్ సంస్థల సీఎండీలు బుద్ధప్రకాష్, కృష్ణభాస్కర్, ముషారఫ్, హరీష్, జితేష్ వి.పాటిల్‌లతో కలసి మీడియాతో మాట్లాడారు. “పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పకుండా ప్రతిపక్షంలో ఉన్నారని భారాస నేత హరీశ్‌రావు ఏదిపడితే అది మాట్లాడటం సరికాదు. రాజకీయ విమర్శల కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రజల్లో అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదు. రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని హరీశ్‌రావుకు చెబుతున్నా. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిన పరిస్థితుల్లోనూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు, సిబ్బందిని ప్రశంసించాల్సింది పోయి కొందరు నాయకులు తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించబోతున్నామని, లిస్టెడ్ కంపెనీలుగా మార్చబోతున్నామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలనే నెహ్రూ విధానం మాది.

**బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా నాడు పక్కన పెట్టారు**

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు లింకేజీపై గత పాలకులకు ముందుచూపు లేదు. జీ9 గ్రేడ్ రకం బొగ్గు అందుబాటులో లేకపోయినా 2018లో 7 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి కేటాయిస్తామని, మరో 7 మిలియన్ టన్నులు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామని తెలిపారు. 2022 ఏప్రిల్‌లో ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సింగరేణి నుంచే మొత్తం 14 మిలియన్ టన్నులూ సరఫరా చేస్తామని చెప్పారు. అయితే 2022–23 ఆర్థిక సంవత్సరంలో సిగరేణిలో జీ9 గ్రేడ్ రకం బొగ్గు ఉత్పత్తి కేవలం 1.71 మిలియన్ టన్నులే. అప్పటికే ఉన్న పాత ప్లాంట్లకే అది సరిపోలేదు. మరి 14 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి ఇస్తామని ఎలా ఒప్పందం చేశారు? ఇది వాస్తవమా.. కాదా చెప్పాలని హరీశ్‌రావుకు సవాల్ విసురుతున్నా. యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.6.66 అవుతుంది. ఈ ధర ఎక్కువగా ఉండటంతో తెలంగాణ ప్రజలపైనే ఆర్థికభారం భారం పడుతుంది. ఈ పాపం భారాస పాలకులదే” అని భట్టి విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీలపై హరీశ్‌రావు విమర్శలను విలేకరులు ప్రస్తావించగా భట్టి.. దక్షిణ డిస్కం జితేష్‌ను వివరించాలని మైక్ ఇచ్చారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈఆర్సీ నిర్ణయం తీసుకుందని జితేష్ తెలిపారు.

# హైదరాబాద్ పై సెలబ్రెటీల వ్యాపారాల సందడి

**హైదరాబాద్, అక్టోబరు 7, పెన్ పవర్:** పలువురు సెలబ్రిటీలు ముఖ్యంగా సినీ రంగంలోని ప్రముఖులు, క్రీడాకారులు కేవలం తమ వృత్తికే పరిమితం కావట్లేదు. తమ రంగాలను దాటుకొని ఇతర వ్యాపారాల్లోనూ సత్తాచాటుతున్నారు. ఇటీవలి కాలంలో ఇది కాస్త ఎక్కువైందనే చెప్పొచ్చు. ముఖ్యంగా క్రికెటర్లు ఇందులో కాస్త ముందే ఉన్నారు. క్రికెట్‌లో భారత్ తరఫున విశేషంగా రాణించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాక అక్కడే ఆగిపోవట్లేదు. క్రికెట్లో పేరు, డబ్బు,అభిమానుల్ని సంపాదించిన తర్వాత చాలా మంది స్టార్ క్రికెటర్లు తమ కెరీర్‌ను మైదానం దగ్గరే ముగించట్లేదు. దానిని దాటుకొని మరో రంగంలో తమ కెరీర్‌ను మరింత పదిలంగా నిర్మించుకుంటున్నారు. రెస్టారెంట్లు, స్పోర్ట్స్ అకాడమీలు,వెల్‌నెస్, ఫిట్‌నెస్, స్టార్టప్స్, టెక్నాలజీ, తయారీ రంగాల్లో విశేషంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు ప్రధానంగా హైదరాబాద్ వారికి గమ్యస్థానంలో మారుతోంది.తాజాగా క్రికెట్ దిగ్గజం, భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 7ఖునవశ్రీం మీ ఇవ్త్రశీఅఱ పేరుతో ఇండోర్ స్పోర్ట్స్, వెల్‌నెస్ ఫెసిలిటీని ప్రారంభించడంతో ఈ అంశం మరోసారి ఆసక్తికరంగా మారింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పాడెల్ కోర్టులతో పాటు జిమ్, రికవరీ సూట్, సౌనా, ఐస్‌బాత్, ఇన్‌ఫ్రారెడ్ రూమ్, యోగా- పిలేట్స్ స్టూడియో, కెఫే, వ్యూయింగ్ గ్యాలరీ వంటివి ఉన్నాయి. ధోనీతో పాటుగా పడేల్ పార్క్ సహ వ్యవస్థాపకులు నిఖిల్ సచ్‌దేవ్, జిగర్ దోషి, ప్రతీక్ దోషి ప్రారంభించారు. ఇక్కడ ప్రారంభ స్థాయి ఆటగాళ్ల నుంచి అనుభవం ఉన్న వారి వరకు శిక్షణ, ఎక్విప్‌మెంట్స్ అద్దె, స్థానిక టోర్నమెంట్లు నిర్వహించనున్నారు. అయితే ఇది కేవలం పాడెల్ కోర్టు మాత్రమే కాదు. స్పోర్ట్స్ంఫిట్‌నెస్ంరికవరీం సోషల్ స్పేస్ అన్న కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేశారు. దేశంలో ఇప్పటికే 1.25 లక్షలుపైగా యాక్టివ్ పాడెల్ ప్లేయర్లు ఉన్నారు. ఇక ఇతర క్రికెటర్ల వ్యాపారాలు ఏమేం ఉన్నాయో చూద్దాం.

**కోహ్లీకి హైదరాబాద్‌లో రెస్టారెంట్ బిజినెస్**

క్రికెటర్ల బిజినెస్‌కు సంబంధించి హైదరాబాద్ పేరు చర్చకు రావడానికి మరో ప్రధాన కారణం విరాట్ కోహ్లీ. అవును కోహ్లీకి చెందిన వన్ జీహైదరాబాద్ హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీలో ప్రారంభమైంది. ఇది సాధారణ రెస్టారెంట్ కంటే లైఫ్‌స్టైల్, డైనింగ్, సోషల్ ఎక్స్‌పీరియెన్స్‌ను కలిపే కాన్సెప్ట్‌గా రూపొందింది. కోహ్లీకి రెస్టారెంట్ వ్యాపారంతో పాటుగా ాఅవ8, ఔతీశీస్త్రఅ వంటి బ్రాండ్లతోనూ వ్యాపార సంబంధాలు ఉన్నాయి. ఇంకా బ్లూ ట్రైబ్, రేజ్ కాఫీ, డిజిట్ ఇన్సూరెన్స్ వంటి పలు సంస్థల్లోనూ ఆయన పెట్టుబడులు కలిగి ఉన్నారు.

**సిరాజ్‌కు హైదరాబాద్‌లో సొంత రెస్టారెంట్**

హైదరాబాద్ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ కూడా తన సొంత హైదరాబాద్ నగరంలో రెస్టారెంట్ వ్యాపారంలో రాణిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో జీశీష్ఘుతీటుఖ - టేస్ట్ అబై ది రెస్ట్ పేరుతో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. సిరాజ్‌కు హైదరాబాద్ నగరంతో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని బిజినెస్ బ్రాండ్‌గా మార్చిన ఉదాహరణగా దీనిని చూడొచ్చు.

అంబటి రాయుడు- డైనింగ్ నుంచి సోషల్ స్పేస్ వరకు

మరో భారత మాజీ క్రికెటర్, హైదరాబాద్‌కే చెందిన అంబటి రాయుడు కూడా నగరంలో హాస్పిటాలిటీ రంగంలోకి అడుగుపెట్టారు. సైనిక్ పురిలో బరాక్స్ పేరుతో మల్టీ లెవెల్ డైనింగ్, సోషల్ స్పేస్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారు. క్రికెటర్లు ప్రధానంగా రెస్టారెంట్లను ఎంచుకోవడానికి ప్రధాన కారణంగా వారి సొంత బ్రాండ్ విలువ అన విశ్లేషకులు చెబుతున్నారు. క్రికెట్ మైదానంలో వారికి దక్కిన గుర్తింపు, ఫ్యాన్ బేస్‌ను ఆఫ్ ఫీల్డ్ బిజినెస్ బ్రాండ్‌కు ఉపయోగించుకుంటున్నారు.

**లక్ష్మణ్- క్రికెట్ నేర్పే బిజినెస్**

రెస్టారెంట్లకు మాత్రమే పరిమితం కాకుండా క్రికెట్ రంగంలోనే ఇతర వ్యాపార అవకాశాలను వెతుక్కున్న వారిలో వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ముందు వరుసలో ఉన్నారు. హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్‌లోని శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో వీవీఎస్ స్పోర్ట్స్ అకాడమీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. యువ క్రికెటర్లకు శిక్షణ అందించే స్పోర్ట్స్ అకాడమీగా ఇది పనిచేస్తోంది.

**సచిన్ హైదరాబాద్ కంపెనీలో పెట్టుబడులు**

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలో స్టార్ క్రికెటర్ పెట్టుబడులకు మరో మంచి ఉదాహరణగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందుల్కర్ నిలుస్తున్నారు. 2023లోనే సచిన్ హైదరాబాద్‌కు చెందిన ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీలో వ్యూహాత్మక పెట్టుబడులుపెట్టి చిన్న వాటాను తీసుకున్నారు. ఈ సంస్థ ఏరోస్పేస్, ఎనర్జీ, డిఫెన్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలకు అవసరమైన అత్యంత కచ్చితత్వంతో తయారు చేసే ఇంజినీరింగ్ కాంపోనెంట్లను రూపొందిస్తుంది. ఈ కంపెనీ ఐపీఓకు ముందు సచిన్ పెట్టుబడి విలువ గణనీయంగా పెరిగింది. ఇంకా ఈ ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థలో క్రీడాకారుల్లో సచిన్ ఒక్కడే కాదు పీవీ సింధు, సైనా నెహ్వాల్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి ఇతర క్రీడా ప్రముఖులు కూడా పెట్టుబిడిదారులుగా ఉన్నారు.

**అసలు హైదరాబాద్ వైపే ఎందుకు?**

మరి వీరంతా దేశంలో ఇన్ని నగరాలు ఉండగా హైదరాబాద్‌నే ఎందుకు ఎంచుకుంటున్నారనే అంశం చర్చనీయాంశంగా మారింది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ నగరం- ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, స్పోర్ట్స్ రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. పెద్ద సంఖ్యలో యువత, పెరుగుతున్న ఆదాయ ప్రీమియం లైఫ్‌స్టైల్‌కు పెరుగుతున్న డిమాండ్ వంటి అంశాలు కొత్త బిజినెస్ మోడళ్లకు మార్కెట్‌ను సృష్టిస్తున్నాయి. ఇంకా హైదరాబాద్ స్వయంగా ఒక పెద్ద క్రికెట్ మార్కెట్ కూడా. క్రికెట్ ఫ్యాన్స్, ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు, లోకల్ టాలెంట్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కలిసి క్రీడాకారుల బ్రాండ్‌కు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి.

# 2018లోనే కేంద్రం యాదాద్రికి బొగ్గు కేటాయించింది



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా ఈరోజు రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొందని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. సర్కారు చేసిన తప్పుల్ని సరిదిద్దుకోకుండా.. భారాసపై నిందలేస్తే కరెంటు కష్టాలు తీరవని ఆయన తెలిపారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో బుధవారం చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఒక ప్రకటనలో స్పందించారు. "విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల పేరిట రూ.5,420 కోట్ల భారం మోపడం గురించి భారాస ప్రశ్నిస్తే.. భట్టి ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోయారు? దానిని ప్రజా పాలన అంటారా" అని ప్రశ్నించారు. "రైతులు రోడ్ల మీదకు వచ్చి కరెంట్ కోసం ధర్నాలు చేస్తుంటే.. కోతలే లేవు అని చెప్పడం మీకే చెల్లింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 15.2.2018 నాటి ఉత్తర్వుల ప్రకారం.. సింగరేణి గనుల నుంచి 14 ఎంటీపీఏ బి-9 గ్రేడ్ బొగ్గును యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు కేటాయించింది. మరి కేటాయింపు లేదని ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎందుకు సత్యదూరపు మాటలు మాట్లాడారు? బొగ్గు ఉన్న దగ్గరే విద్యుత్ ప్లాంట్ ఉండాలని చెబుతున్న మీరు.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమలో నీళ్లు, బొగ్గు లేని చోట థర్మల్ ప్లాంట్ పెట్టింది నిజం కాదా? ఆనాడు ఎందుకు మౌనంగా ఉన్నారు? సింగరేణి సహా విద్యుత్ సంస్థలను ఐపీవో, కొత్త అప్పుల దిశగా తీసుకు వెళ్లేందుకు ఎనర్జీ రిఫార్మ్స్ కమిటీని ఏర్పాటు చేసి.. దానికి ఛైర్మన్‌గా ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణ్యంను నియమించాలనే ప్రతిపాదన నిజమా కాదా? ఇప్పటికైనా కరెంటు కోతలు లేకుండా చూడాలి. ప్రజలపై వేసిన రూ.5,420 కోట్ల భారాన్ని వెనక్కి తీసుకోవాలి" అని హరీశ్‌రావు.. డిప్యూటీ సీఎం భట్టిని డిమాండ్ చేశారు.

# రెండు వద్దు..మూడు ముద్దు...

**హైదరాబాద్, అక్టోబరు 7, పెన్ పవర్:** దేశంలో ఇళ్ల కొనుగోలుదారుల ప్రాధాన్యతల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు 2బీహెచ్ కే ఇళ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ప్రజలు, ఇప్పుడు విశాలమైన 3బీహెచ్ కే ఇళ్ల వైపు ఎక్కువగామొగ్గుచూపుతున్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'అనరాక్' నిర్వహించిన తాజా 'వినియోగదారుల సెంటిమెంట్ సర్వే - ఎ1 2026'లో ఈ ఆసక్తికర విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా14 ప్రధాన నగరాల్లో 8,320 మందిపై ఈ సర్వే నిర్వహించారు.సర్వే ప్రకారం, ఇల్లు కొనాలనుకుంటున్న వారిలో అత్యధికంగా 48% మంది 3బీహెచ కే ఫ్లాట్లకే తమ మొదటి ఓటు వేశారు. ఆ తర్వాత38% మంది 2బీహెచ్ కే ఇళ్లను ఎంచుకున్నారు. కేవలం 3బీహెచ్ కే లే కాకుండా, 4బీహెచ్ కే లేదా అంతకంటే పెద్ద ఇళ్లపై ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య కూడా 2024 ప్రథమార్థంలో 3% ఉండగా,ఇప్పుడు 5 శాతానికి పెరగడం గమనార్హం.నగరాల వారీగా చూస్తే, అహ్మదాబాద్‌లో అత్యధికంగా 57% మంది 3బీహెచ్ కే ఇళ్లను కోరుకుంటుండగా, చెన్నై, ఢిల్లీ-ఎన్సీఆర్ లో 53% మంది, హైదరాబాద్‌లో52% మంది పెద్ద ఇళ్లవైపే మొగ్గుచూపుతున్నారు. బెంగళూరు, కోల్‌కతాలలో 46% మంది ఉండగా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో మాత్రం అత్యల్పంగా 39% మంది మాత్రమే 3 బీహెచ కేలనుఇష్టపడుతున్నారు.ఈ మార్పు కేవలం విస్తీర్ణంలోనే కాకుండా బడ్జెట్‌లోనూ కనిపిస్తోంది. కొనుగోలుదారులలో 34% మంది రూ.90 లక్షల నుంచి రూ.1.5 కోట్ల మధ్య ధర ఉండే ఇళ్లనుఎంచుకుంటున్నారు. మరో 27% మంది రూ.1.5 కోట్లకు పైబడిన ఇళ్లపై ఆసక్తి చూపడం విశేషం. రూ.45 లక్షలలోపు బడ్జెట్ ఇళ్లకు ఆదరణ గణనీయంగా తగ్గింది. సర్వేలో పాల్గొన్న వారిలో 68% మంది సొంత వాడకం కోసమే ఇల్లు కొంటున్నామని చెప్పగా, 32% మంది పెట్టుబడి కోసం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.ఆస్తుల ధరలు పెరుగుతున్నాయని 65% మంది ఆందోళన వ్యక్తంచేసినప్పటికీ, కొనుగోలు ప్రణాళికల నుంచి ఎక్కువ మంది వెనక్కి తగ్గడం లేదు. 44% మంది ఎలాగైనా కొనాలని భావిస్తుండగా, 38% మంది కొద్దికాలం వాయిదా వేయొచ్చని తెలిపారు. ఈ మార్పులపైఅనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పురి మాట్లాడుతూ, "ధరలు పెరుగుతున్నప్పటికీ, కొనుగోలుదారులు విశాలమైన, నాణ్యమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రీమియం ఇళ్లపై ఆకాంక్ష కేవలంధనవంతులకే పరిమితం కాదని, మధ్యతరగతిలోనూ ఈ ధోరణి బలపడుతోందని" వివరించారు. ఇప్పటికీ 60% మంది భారతీయులు స్టాక్స్, బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే రియల్ ఎస్టేట్‌నే అత్యుత్తమపెట్టుబడిగా భావిస్తున్నట్లు ఈ సర్వే స్పష్టం చేసింది.

# 40 మంది పౌరసత్వాల రద్దుకు అమెరికా రంగం సిద్ధం!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మోసపూరిత మార్గాల్లో, నేర చరిత్రను దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందిన 40 మంది విదేశీయుల పౌరసత్వాలను రద్దు చేయడానికి రంగం సిద్ధం చేసింది. వీరిలో ఒక భారతీయుడు కూడా ఉండటం గమనార్హం. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' (పౌరసత్వ రద్దు) చర్యగా ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అమెరికా న్యాయశాఖ (డీవోజే) ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.న్యాయశాఖ వివరాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో మొత్తం 40 మందిపై సివిల్ కేసులు దాఖలు చేశారు. వీరంతా తీవ్రమైన నేరాలకు పాల్పడటం లేదా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసేటప్పుడు కీలక వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచి, తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. "గూఢచర్యం నుంచి మైనర్లపై లైంగిక నేరాల వరకు అనేక తీవ్రమైన నేరాలకు పాల్పడిన వీరు, తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారు" అని అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వ ప్రక్రియలో మోసాన్ని ఎంతమాత్రం సహించేది లేదని సివిల్ డివిజన్ అసిస్టెంట్ అటార్నీ జనరల్ బ్రెట్ ఎ. షుమేట్ స్పష్టం చేశారు.పౌరసత్వం రద్దు జాబితాలో కాలిఫోర్నియాలో నివసిస్తున్న 55 ఏళ్ల భారతీయుడు బల్విందర్ సింగ్ కూడా ఉన్నారు. ఇతను రెండు వేర్వేరు గుర్తింపులతో అమెరికా అధికారులను మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక ఐడెంటిటీతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకుని, ఆ తర్వాత 2003లో మరో ఐడెంటిటీతో పర్మినెంట్ రెసిడెంట్ హోదా పొందాడు. 2009లో రెండో ఐడెంటిటీతోనే పౌరసత్వం కూడా సంపాదించాడు. అయితే, వేలిముద్రల ఆధారంగా రెండు దరఖాస్తులు చేసింది ఒకే వ్యక్తి అని అధికారులు గుర్తించారు.ఈ జాబితాలో చైనాకు గూఢచర్యం చేశాడన్న ఆరోపణలపై 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్న అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నాడు. ఇతరులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసాలు వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ 40 మందిలో మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియాతో పాటు 20కి పైగా దేశాలకు చెందిన వారున్నారు.ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం, కోర్టులు వీరిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలిస్తే పౌరసత్వం రద్దవుతాయి. ఆ తర్వాత వారిని దేశం నుంచి బహిష్కరించే (డిపోర్టేషన్) ప్రక్రియను ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఈ కేసులన్నీ ప్రారంభ దశలోనే ఉన్నాయి.

# కొత్త ల్యాండ్ పూలింగ్ తో అభివృద్ధి చేసిన ప్లాట్లు

**హైదరాబాద్, అక్టోబరు 7, పెన్ పవర్:** భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణ ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. భూములు తీసుకుని డబ్బులు చెల్లించే విధానానికిబదులుగా.. భూయజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మూసీ ప్రక్షాళన, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్‌పరిధిలోని కొన్ని ప్రాజెక్టుల్లో ఈ విధానం అమలవుతోంది. అక్కడ మంచి ఫలితాలు వస్తే రాష్ట్రంలోని సాగునీరు, రహదారులు, భవనాలు సహా వివిధ శాఖల ప్రాజెక్టులకు దీనిని విస్తరించాలని ప్రభుత్వంభావిస్తోంది.ఇందుకోసం తెలంగాణ సమగ్ర ప్రాంత అభివృద్ధి, ప్రణాళిక బిల్లు-2026ను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే హెచ్ఎండీఏ, పట్టణాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్లుసహా ప్రభుత్వం గుర్తించే ఇతర సంస్థలు ల్యాండ్ పూలింగ్ చేపడతాయి.రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ప్రతిపాదిత బుల్లెట్ రైలు టెర్మినల్ వంటి ప్రాజెక్టులకు వేల ఎకరాలు అవసరం. ముఖ్యంగారంగారెడ్డి జిల్లాలో భూముల అవసరం ఎక్కువగా ఉంది. దీంతో ప్రభుత్వం ఈ విధానంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఈ పథకంలో పట్టా భూముల యజమానులతో పాటు అసైన్డ్ భూములు, సీలింగ్ మిగులుభూములు, భూదాన్ భూములు, కొన్ని ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు కూడా ప్రయోజనం కల్పించనున్నారు. అయితే తిరిగి ఇచ్చే భూమి విస్తీర్ణం, భూమి హక్కు, ప్రాంతాన్ని బట్టి మారుతుంది.ఈ విధానంలో రెండు మార్గాలను ప్రతిపాదించారు. యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలింగ్ కోరితే దాన్ని 'కన్సెంట్ బేస్డ్ ల్యాండ్ పూలింగ్'గా పరిగణిస్తారు. రింగ్ రోడ్లు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త పట్టణాల వంటి కీలక ప్రాంతాల్లో ప్రభుత్వం స్వయంగా చేపట్టే పూలింగ్‌ను 'గైడెడ్ ల్యాండ్ పూలింగ్'గా పేర్కొన్నారు.మూసీ ప్రాజెక్టు, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ ప్రాజెక్టులకు ఇప్పటికే ప్రభుత్వం జీవో 240, జీవో 243 జారీ చేసింది. వీటి ప్రకారం పట్టా భూములకు ఎకరానికి గరిష్ఠంగా 1,400 చదరపు గజాలు లేదా అభివృద్ధి చేసిన భూమిలో 50 శాతం వాటా.. ఏది తక్కువైతే అది లభిస్తుంది. సరస్సులు, నదుల బఫర్ ప్రాంతాల్లో ఎకరానికి 800 చదరపు గజాలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో 400 చదరపు గజాల వరకు ఇవ్వనున్నారు.భూసేకరణ చట్టాన్ని పక్కన పెట్టేందుకే ఈ విధానం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు నోటీసులు, అభ్యంతరాలకు అవకాశం, పరిహారం, పునరావాసం వంటి నిబంధనలు కొనసాగుతాయని చెబుతున్నారు.

# డిసెంబర్ తర్వాత నీటికి కటకటే...




**హైదరాబాద్, అక్టోబరు 7, పెన్ పవర్:** భాగ్యనగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్ నగరంలో తీవ్రమైన తాగునీటి సంక్షోభం తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో నగరం యొక్క ప్రధాన నీటి వనరులైన జలాశయాల్లో నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, పశ్చిమ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కీలకమైన సింగూర్ జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది మొత్తం సామర్థ్యంలో కేవలం 13 శాతం మాత్రమే. వేసవిలో ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఇది సగానికి పడిపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 60 రోజుల్లో, అంటే డిసెంబర్ మధ్య నాటికే సింగూర్ జలాశయం పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.పాతబస్తీ, చుట్టుపక్కల ప్రాంతాలకు నీరందించే మరో ముఖ్యమైన వనరు ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నీటిమట్టం కూడా గణనీయంగా తగ్గింది. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ ఇప్పుడు 2.2 టీఎంసీలకు పడిపోయింది. వీటికి తోడు, నాగార్జున సాగర్‌తో అనుసంధానమైన జలాశయాలతో సహా ఇతర ప్రధాన రిజర్వాయర్లకు కూడా ఇన్‌ఫ్లోలు (నీటి చేరిక) భారీగాతగ్గిపోయాయి. దీంతో నగరంపై నీటి సంక్షోభ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి.పరిస్థితి తీవ్రతను గ్రహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) వెంటనే అప్రమత్తమైంది. సింగూర్, మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను గుర్తించి, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలుసిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.సాధారణంగా వేసవి కాలంలో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఈసారి ముందుగానే డిసెంబర్ లేదా జనవరి నెలల నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందనినీటిపారుదల శాఖకు చెందిన ఓ చీఫ్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం వర్షపాతం లోటు ఉందని అధికారికంగా ప్రకటించింది. వ్యవసాయ అవసరాల కంటే తాగునీటికే మొదటిప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మీద రాబోయే రోజుల్లో భాగ్యనగర వాసులు నీటి కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.దుర్గం చెరువుహైదరాబాద్‌లోని ప్రఖ్యాత దుర్గం చెరువు సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సిద్ధమవుతోంది. సుమారు140 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రతిపాదనకు సోమవారం జరిగిన సీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఎస్పీవీ ద్వారా చెరువు అభివృద్ధి ప్రాజెక్టునుప్రత్యేకంగా చేపట్టడంతో పాటు, ఈ కార్యక్రమానికి అవసరమైన నిధుల సమీకరణ కూడా సులభతరం అవుతుందని భావిస్తున్నారు.దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు అధికారులుకొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెరువు చుట్టూ నాలుగు ప్రధాన మురుగునీటి మార్గాలను గుర్తించి, వాటిని అడ్డగించి శుద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. గతంలోనూదుర్గం చెరువు చుట్టూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలు కల్పించారు. తాజా నిర్ణయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.ఇదే సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకుకూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. చింతల కుంట చెరువు పునరుద్ధరణ కోసం రూ.21.59 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల పూర్తికి రూ.5.95 కోట్లు, గజులరామారం సర్కిల్‌ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.5.18 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీ-వర్క్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు కూడా ఆమోదం లభించింది.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

## పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతూ.. సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్




ఇద్దరమ్మా ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ 27వ వార్డు కౌన్సిలర్ భూక్య పుల్చంద్. నాయక్

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 7:** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ 27వ వార్డు పరిధిలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, 27వ వార్డు కౌన్సిలర్ భూక్యా పుల్చంద్ హాజరై నూతన గృహంలోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల జీవితాల్లో సొంతింటి సంతోషాన్ని నింపడం ఎంతో గొప్ప విషయమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో పేద కుటుంబాల చిరకాల కోరిక నెరవేరుతోందని అన్నారు. సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆ కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుని నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబంలో కనిపిస్తున్న ఆనందం తమకు కూడా ఎంతో సంతోషాన్ని కలిగించిందని నాయకులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంలో సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి సొంతింటి కల సాకారం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధరావత్ కిషన్, ధరావత్ రామారావు, చేను శ్రీను, వార్డు నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బడేటి మల్లేశం గౌడ్ నాల్గవ వర్ధంతి

## రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదానం

## నివాళులర్పించిన వృద్దులు, సిబ్బంది





**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 7:** హైదరాబాద్ వనస్థలిపురంలోని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లికి చెందిన దివంగత బడేటి మల్లేశం గౌడ్ నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వృద్దులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ బడేటి మల్లేశం గౌడ్ నాల్గవ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు తమ వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులు ఆ కుటుంబ సభ్యులపై ఉండాలని కోరుకున్నామని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఆశ్రమ సిబ్బంది, వృద్దులు ఉన్నారు.

# చండూర్ సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు..

## 9 నుంచి 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. వరి పంటలు చివరి దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజీతోపాటు తరచూ ట్రిప్పింగ్ జరుగుతోందని రైతులు తెలిపారు. దీంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సమస్య తలెత్తడంతో సాగునీరు అందించలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రోజుకు 9 నుంచి 12 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను ఇప్పటికే ఏఈ, ఏఈడీల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. విద్యుత్ సమస్య కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని స్పష్టం చేశారు.

# జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి

## రేపటి ఖమ్మం విద్యార్థి-యువజన ప్రజా ప్రదర్శనను జయప్రదం చేయండి




**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 7 :** ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించేందుకు విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలి. ఓటర్ల జాబితాలో అక్రమ తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జీలను వెంటనే నిలిపివేయాలి.” అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. మనోజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు మస్తాన్, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాలని వారు కోరారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. విద్యార్థులు, యువత తమ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు నిర్వహిస్తుంటే పోలీసుల లాఠీచార్జీలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. విద్యార్థులు, యువతపై జరుగుతున్న లాఠీచార్జీలను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని అన్నారు. ఓటర్ల జాబితాలో జరిగినట్లు చెబుతున్న భారీ తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఆ హక్కును కాపాడటం అత్యంత ముఖ్యమన్నారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం జరిగే పోరాటాలను అణచివేయకుండా ప్రభుత్వం సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పారదర్శక చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తాం.” అని నాయకులు హెచ్చరించారు. రేపు ఖమ్మంలో నిర్వహించనున్న విద్యార్థి, యువజన ప్రజా ప్రదర్శనకు విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీ. రాజు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు త్రినాథ్, సుశాంత్, శ్రీరామ్, మనోహర్, జానీ పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మేకల పవన్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాము, విశ్వంత్, సంజయ్, చందు, తిమ్మిడి రఘు, బాలు, చరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పై రేవంత్ బ్రహ్మాస్త్రం : ఎర్రవెల్లి కేంద్రంగా కాకరేపుతున్న రాజకీయం




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ను రాజకీయంగా ఇరుకున పెట్టే లక్ష్యంతో రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. కేసీఆర్ ఫాం హౌసు ఉన్న ఎర్రవెల్లిలో అమరవీరుల కోసం కాలనీ నిర్మించాలని ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదన హీట్ పుట్టిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ ను రాజకీయంగా దెబ్బతీయాలని భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమరవీరులకు ఇళ్లు నిర్మించాలనే అంశాన్ని బ్రహ్మాస్త్రంగా మలుచుకున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇందుకోసం కేసీఆర్ ఫాంహౌసుకు ఎదురుగా ఉన్న భూములను ఎంపిక చేసుకోవడమే రాజకీయంగా చర్చనీయాంశం అవుతోందని అంటున్నారు. ఇప్పటివరకు ఎర్రవెల్లి అంటే మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం మాత్రమే గుర్తుకు వచ్చేది. అయితే ఇప్పుడు అక్కడ అమరవీరుల కాలనీ నిర్మించి అంతే ప్రాచుర్యం తేవాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. దీనిద్వారా మాజీ సీఎం పక్కనే తాము అమరవీరులకు ఇళ్లు కట్టించి ఇచ్చామని చెప్పుకోవాలని రేవంత్ రెడ్డి ఎత్తుగడ వేశారని అంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించలేని పరిస్థితిని తీసుకురావడం ద్వారా ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీని ఇరుకన పెట్టేశారని అంటున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రావడానికి కారణమైన తమను బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందనే అసంతృప్తితో ఉన్న ఉద్యమకారుల దృష్టిని ఆకర్షించి రాజకీయంగా పైచేయి సాధించారని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన అమరవీరులకు సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే నిర్ణయంతోపాటు అందుకు గడువు కూడా విధించడంతో తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో ఉద్యమ పార్టీగా చెప్పుకున్న బీఆర్ఎస్ కన్నా తానే ఉద్యమకారులకు బాసటగా నిలుస్తున్నానని చెప్పుకోవడం ద్వారా గులాబీ పార్టీ ఓటు బ్యాంకుకు చిల్లు పెట్టాలని సీఎం వ్యూహారచన చేశారని అంటున్నారు. ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌసులో ప్రభుత్వ భూములు ఉన్నాయని ఆరోపణలతో సంచలనం సృష్టించిన రేవంత్, ఆయన ఫాం హౌసుకు ఎదురుగా అమరవీరుల కాలనీ నిర్మించడం ద్వారా తెలంగాణ సమాజాన్ని తనవైపు తిప్పుకునేలా ప్రణాళిక వేశారని అంటున్నారు. ఈ విధంగా తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీకి ఉన్న గుర్తింపును హైజాక్ చేసేలా కూడా సీఎం రేవంత్ రెడ్డి ఎత్తుగడ వేశారని అంటున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ తెస్తే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రచారం చేయడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ కన్నా కాంగ్రెస్ వల్లే తెలంగాణ కల సాధ్యమయిందని, బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక రాష్ట్రంలో తమ సొంత ఆస్తులు పెంచుకునేందుకు మాత్రమే పరిమితమయ్యారని ప్రచారం చేయడానికి ఈ అంశాన్ని వాడుకునేలా రేవంత్ రెడ్డి ప్లాన్ చేశారని అంటున్నారు. ఎర్రవెల్లిలో అమరవీరుల కోసం ప్రత్యేక కాలనీ నిర్మించడం ద్వారా, తమ త్యాగాలను గుర్తించలేదని ఇన్నాళ్లు బాధపడుతున్న ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేసినట్లు అవుతుందని సీఎం నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. మొత్తానికి ఒక్క నిర్ణయంతో తెలంగాణ రాజకీయాలను సీఎం రేవంత్ రెడ్డి షేక్ చేశారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక పాదయాత్రల సీజన్

**హైదరాబాద్, అక్టోబరు 7, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు రానున్న కాలంలో పూర్తిగా వీధులు, పల్లె బాట పట్టనున్నాయి. 2028 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్ కానున్న 2027 సంవత్సరం రాష్ట్రంలో అక్షరాలా పాదయాత్ర నామ సంవత్సరం గా మారబోతోంది. తెలుగు నాట అధికారం దక్కించుకోవడానికి లేదా నిలబెట్టుకోవడానికి కాలినడకనే అత్యంత శక్తివంతమైన రాజకీయ అస్త్రంగా గట్టిగా నమ్ముతున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర గళాలు సైతం బూట్ల లేసులు కట్టుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎవరి వ్యూహాలు వారికున్నప్పటికీ, 2027లో రాష్ట్రంలోని ప్రధాన రహదారులన్నీ రాజకీయ నేతల పాదయాత్రలతో కిక్కిరిసిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2027లో చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త పాదయాత్రపై ఇప్పటికే ఆ పార్టీ శ్రేణుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజల్లో పట్టు పెంచుకునేందుకు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ పాదయాత్రనే గేమ్ ఛేంజర్ గా ఆయన భావిస్తున్నారు. మరోవైపు, తెలంగాణ రక్షణ సేన పెట్టి సీఎం అయిపోతానని శపథం చేస్తున్న కల్వకుంట్ల కవిత సైతం మహిళా లోకం, సింగరేణి సహా క్షేత్రస్థాయి కార్మిక వర్గాలతో మమేకమయ్యేలా సమాంతర పాదయాత్ర ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రతిపక్షాలకు ఆ ఒక్క స్పేస్ కూడా వదిలిపెట్టకూడదని అధికార కాంగ్రెస్ శిబిరం కూడా భారీ సన్నాహాలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల క్షేత్రస్థాయి ఫలితాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిష్టాత్మక పాదయాత్రకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. సీఎంకు తోడుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ వేర్వేరు ప్రాంతాలను ఎంచుకుని పాదయాత్రల ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. గతంలో భట్టి చేసిన పీపుల్స్ మార్చ్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించగా, ఈసారి అధికారాన్ని నిలబెట్టుకునే రక్షణ కవచం గా కాంగ్రెస్ త్రయం పాదయాత్రలను మలచుకోనుంది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు ఇతర కాషాయ నేతలు కూడా ప్రజా సమస్యలపై పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఇప్పటికే పలు అంశాలపై క్షేత్రస్థాయిలో ఉన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ప్రజా గొంతుకగా పాదయాత్రను కొనసాగించే యోచనలో ఉన్నారు. ఇలా అధికార పార్టీ నుంచి ముగ్గురు కీలక నేతలు, ప్రధాన ప్రతిపక్షం నుంచి కేటీఆర్, కవితలతో పాటు బీజేపీ, ఇతర గళాలు ఏకకాలంలో రోడ్లపైకి వస్తే ప్రజలు ఎవరి నడకను నమ్ముతారు, ఎవరికి జై కొడతారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ఏడాదిన్నర ముందే మొదలయ్యే ఈ పాదయాత్రల హోరుతో 2027లో తెలంగాణ రాజకీయాలు తారాస్థాయికి చేరడం ఖాయమని అనుకోవచ్చు.

# మున్సిపోల్స్ పై జగన్ సూపర్ స్పీడ్.. అందరికంటే ముందుగా అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అన్న విషయం క్లారిటీ లేకపోయినా, ప్రతిపక్షం వైసీపీ దూకుడు చూపుతోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము రెడీ అంటూ సంకేతాలు పంపుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలోని ఇతర పార్టీలకన్నా ముందుగా అభ్యర్థుల ఖరారుపై దృష్టిపెట్టిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. పార్టీ అధినేత జగన్ రెడ్డి నేతృత్వంలో వైసీపీ నేతలు సమావేశమయ్యారు. ఇందులో అనేక విషయాలపై చర్చించిన పార్టీ నేతలు అధికార కూటమిని దీటుగా ఎదుర్కొనేలా అభ్యర్థులు ఎంపిక ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నెల్లూరు నుంచి విజయ్ కుమార్ రెడ్డిని రంగంలోకి దింపుతున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు.



**అధినేత సమీక్షలు**

రాష్ట్రంలో అక్టోబరు, నవంబరు నెలల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవైపు రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న ప్రభుత్వం కోర్టు నిర్ణయం ఏవిధంగా ఉన్నా ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అంచనా వేస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆయన తాడేపల్లిలో వరుసగా జిల్లాల నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే అభ్యర్థుల ఎంపిక చేసుకోవాలని స్వేచ్ఛ ఇచ్చిన అధినేత కొన్ని కీలక స్థానాల విషయంలో తానే స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారని అంటున్నారు.

**తొలి అభ్యర్థి ఆనం**

స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్న నేపథ్యంలో పార్టీలు అప్రమత్తమయ్యాయి. సరైన అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ చేస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ తొలి పేరు ప్రకటించింది. నెల్లూరు మేయర్ రేసులో ఆనం విజయ్ కుమార్ రెడ్డిని పోటీకి పెడుతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. రిజర్వేషన్ ప్రక్రియపై స్పష్టత లేకపోయినా, అధికార పార్టీ నేతలు నెల్లూరు జనరల్ కేటగిరీలోకి వస్తుందన్న అంచనాతో అప్పుడే ప్రచారం చేసుకుంటున్నారని, తాము వెనకబడకూడదనే ఆలోచనతో మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర పార్టీలు ఏవీ ఇంతవరకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం వెలువరించలేదు. కానీ, వైసీపీ మాత్రం అధికారికంగానే నిర్ణయం తీసుకోవడంతో మున్సిపోల్స్ కు ముందుగా దూసుకువచ్చినట్లు చెబుతున్నారు.

**కంగూరు పెడుతున్న కూటమి**

స్థానిక ఎన్నికల విషయంలో కూటమి రాజకీయాలు విపక్షాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ఆ పార్టీ ఎన్నికల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోయినప్పటికీ నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం చూస్తుంటే, ఎన్నికలను ఆ పార్టీ ఎంత సీరియస్ గా తీసుకుందో అర్థమవుతోందని అంటున్నారు. అధికార పార్టీ ఇంతవరకు ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకపోయినా, స్థానిక నేతలు అంతా ఓ నిర్ణయం తీసుకుని ఓ నాయకుడిని మేయర్ అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. దీంతో ఆయన నెల్లూరులో అందరినీ కలుస్తూ, మద్దతు కూడగట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ కూడా మేయర్ అభ్యర్థిని ముందుగా ప్రకటించాలని నిర్ణయం తీసుకుని వెనువెంటనే అమలు చేసినట్లుగా చెబుతున్నారు.

**ఆనం ఎందుకు?**

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు నగరంలో ఆనం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ఆ కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో కూటమిలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఇరుకన పెట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ గా ఆవిర్భవించడానికి ముందు మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఆనం కుటుంబానికి చెందిన వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం చైర్మనుగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్యే అయ్యారు. ఈ కారణంగా నగరంలో ఆనం కుటుంబానికి ఉన్న ఆదరణను క్యాష్ చేసుకోవాలని వైసీపీ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందనే సంకేతాలు పంపడానికి ఆనం ఎంపిక నిదర్శనంగా చూపొచ్చునని అంటున్నారు.

# విజయసాయి గ్రౌండ్ వర్క్ సీరియస్ గానే ఉందే

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రజల ఎజెండాగా 15 అంశాలను ప్రకటించానని, ఈ నెల 8న తిరుపతిలో నిర్వహించనున్న తన నాలుగో ప్రెస్‌మీట్‌లో మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందుంచనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కలియుగ దైవమైన తిరుమలేశ్వరుడి సన్నిధిలోని తిరుపతిని ఈ సమావేశానికి వేదికగా ఎంచుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. రాయలసీమ ఎదుర్కొంటున్న కరువు, ఎల్‌నినో ప్రభావం, ఉపాధి అవకాశాల కొరతతో జరుగుతున్న వలసలు వంటి అంశాలపై సమావేశంలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు కుటుంబాలపై కూడా తన విమర్శలను కొనసాగించనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. రాయలసీమ అభివృద్ధి, ప్రాంతీయ సమస్యలు, రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబాల ప్రభావం వంటి అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. గతంలోనూ రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, యువతకు అవకాశాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. మన సంస్కృతి, భారతీయతపై జరుగుతున్న దాడుల అంశాన్ని కూడా తిరుపతి సమావేశంలో ప్రస్తావిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలోనే ఒక వర్గం మైనార్టీగా మారిపోయే పరిస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించి మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచుతానన్నారు. అయితే ఆ ఐదు ప్రతిపాదనలు ఏమిటన్నది ఆయన ఇంకా వెల్లడించలేదు. విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. విజయదశమి తర్వాత పార్టీని ప్రారంభించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గతంలో వెల్లడించారు. పార్టీ విధానాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడం, నిత్యావసరాల ధరలను తగ్గించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్–విద్య–ఉద్యోగాలకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని కూడా ప్రకటించారు. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో తన రాజకీయ కార్యాచరణకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. రాయలసీమ తర్వాత ఉత్తరాంధ్రకు కూడా ప్రాంతీయ అభివృద్ధి, నీటి సమస్యలు, వలసలు, పరిశ్రమలు వంటి అంశాలపై ఆయన ప్రత్యేక ప్రతిపాదనలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో జరగనున్న నాలుగో ప్రెస్‌మీట్‌లో విజయసాయిరెడ్డి ప్రకటించబోయే ఐదు కొత్త ప్రతిపాదనలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సమాజం కోసం ఆలోచించే మీడియా ప్రతినిధులు సమావేశానికి హాజరై తన ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. =



# టీడీపీ కార్యకర్తల కోసం పదవులు రిజర్వు.. 150 మందికి లోకేశ్ బంపర్ ఆఫర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీపై తనదైన ముద్రవేసేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కడప మహానాడులో కార్యకర్తే అధినేత అంటూ పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు ఆ నినాదాన్ని నిజం చేసేలా అడుగులు వేస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న పార్టీ కోసం పనిచేసిన నాయకులను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, వారి కోసం నామినేటెడ్ పదవులను రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి ఆయన అనుమతి కూడా తీసుకున్నారని అంటున్నారు. దీంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేసిన సుమారు 150 మందికి త్వరలో నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో తన ఆరంగేట్రం నుంచి నారా లోకేశ్ తనదైన ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు. తొలిసారిగా కార్యకర్తల సంక్షేమ నిధికి రూపకల్పన చేసి కార్యకర్తల మనసులను గెలుచుకున్నారు. ఆపద సమయంలో అపన్నహస్తం అందించేలా టీడీపీ సభ్యత్వం ఉన్నవారికి బీమా చేయించారు. ఆ తర్వాత కార్యకర్తల కోసం తాను ఉన్నానంటూ పలు కార్యక్రమాలను లోకేశ్ తీసుకువచ్చారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కార్యకర్తలకు అందుబాటులో ఉండటమే కాకుండా, టీడీపీ కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య వంటివారి కుటుంబ సభ్యులకు వెన్నుదన్నుగా నిలిచారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల్లోనూ కార్యకర్తలకు అగ్ర తాంబూలం దక్కాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

ఇక మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 150 మందికి త్వరలో పదవులు దక్కే అవకాశం ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబరులో తొలివిడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. వీరి పదవీ కాలం ఈ నెలతో ముగియనుందని అంటున్నారు. పార్టీలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుతం పదవుల్లో ఉన్న చాలా మందికి రెన్యువల్ చేసే అవకాశం లేదని అంటున్నారు. వీరిస్థానంలో గత ప్రభుత్వంపై ధైర్యసాహసాలతో పోరాడి తెగువ చూపిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. 2024లో రెండు విడతలు సుమారు 148 పదవులను భర్తీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పదవులు అన్నింటిని ఇప్పుడు కొత్తవారికి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. అయితే సహజంగా పదవుల కోసం ఏ పార్టీలో అయినా పైరవీలు ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సుతోనే పదవులు కట్టబెట్టే సంస్కృతి ఇప్పటివరకు ఉందని పరిశీలకులు చెబుతున్నారు. టీడీపీ కూడా ఇప్పటివరకు ఇదే విధానాన్ని అవలంబించిందని అంటున్నారు. అయితే నారా లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ విధానాన్ని సంస్కరించాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. సిఫార్సులు లేకుండా వచ్చే నెలతో ఖాళీ అయ్యే పదవులు అన్నింటిని భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ బహిరంగంగా ప్రకటించారు. పనితీరే ఆధారంగా కార్యకర్తల ఎంపిక ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు. గతంలో చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన వారు, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు, రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించనున్నట్లు చెబుతున్నారు. మొత్తం ఆరు అంశాలను పరిశీలించి కనీసం ఐదింటిలో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేసిన వారికి పదవులు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీంతో మంత్రి లోకేశ్ నిర్ణయం పార్టీ వర్గాల్లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు.

# ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ ఏమౌతోంది

**విశాఖపట్టణం, అక్టోబరు 7, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోటగా నిలిచిన ఉత్తరాంధ్ర లో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత కుదురుకుంటుందని భావించినప్పటికీ, కీలక నేతల వరుస రాజీనామాలు, సస్పెన్షన్లతో పార్టీ గ్రాఫ్ పడిపోయింది. విజయనగరం జిల్లాలో పార్టీకి వెన్నెముకగా ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడంతో బొత్స సత్యనారాయణ ప్రాబల్యంపైనే పెద్ద ప్రశ్నమార్క్ పడింది. దానికి తోడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెన్షన్, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే దువ్వాడ శ్రీను పార్టీకి దూరం కావడంలాంటి కారణాలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ కొంత చేటు తెచ్చింది. ఇక .విశాఖపట్నం రాజకీయాలను పరిశీలిస్తే, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ సహా పలువురు కీలక నేతలు వైఎస్సార్సీపీకి వీడ్కోలు పలికారు. మిగిలిన కొద్దిమంది సీనియర్ నాయకులు సైతం వైఎస్సార్సీపీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటమే కాకుండా, నూతనంగా పార్టీలో చేరేందుకు ఏ ఒక్క ద్వితీయ శ్రేణి నాయకుడు కూడా ఉత్సాహం చూపడంలేదు. అధిష్టానం ఎంత ఒత్తిడి తెచ్చినా క్షేత్రస్థాయిలో కేడర్ను సమాయత్తం చేసే నాయకులు కరువయ్యారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వరకు పార్టీని నడిపించాల్సిన సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రభావం కూడా ఇప్పుడు నామమాత్రంగానే మారిపోయింది. తన స్వంత మేనల్లుడైన మజ్జి శ్రీనివాసరావును కూడా పార్టీలో నిలుపుకోలేకపోయారనే విమర్శలు వైఎస్సార్సీపీ వర్గాల నుంచే వస్తున్నాయి. రీజినల్ కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్నాయి.

ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించేందుకు వైఎస్సార్సీపీ రీ–బిల్డింగ్ ప్లాన్స్ ఏవీ ఉత్తరాంధ్రలో పనిచేయడం లేదు. ఓటమి నిరాశ నుంచి బయటపడకముందే వరుస వికెట్లు పడిపోతుండటంతో పార్టీ క్యాడర్ అయోమయంలో వుంది. సరైన నాయకత్వం, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి పోరాటాలు లేకపోతే.. ఒకప్పుడు తన సొంత కోటగా భావించిన ఉత్తరాంధ్రలోనే వైఎస్సార్సీపీ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

# అసెంబ్లీ ఫార్ములా రగడ...

**ఒంగోలు అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు మరో కీలక రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహరచనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అమరావతిలో దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో స్థానిక ఎన్నికల్లో కూటమి ఎదుర్కొనే ప్రధాన సవాళ్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశం కేవలం సీట్ల పంపకాలపై చర్చకే పరిమితం కాలేదన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టీడీపీ––జనసేన మధ్య సమన్వయం ఎలా ఉండాలి? ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? మిత్రపక్షాల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలకుండా ఎలా చూడాలి? అనే అంశాలే అసలు ఎజెండాగా కనిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రధాన కారణాల్లో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం ఒకటి. ఇప్పుడు అదే ఫార్ములాను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయాలని నాయకత్వం భావిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల స్వభావం అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నం. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక వర్గ సమీకరణాలు, కుటుంబ రాజకీయాలు, గ్రామస్థాయి సంబంధాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే రాష్ట్రస్థాయిలో కుదిరే అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం కూటమి నాయకత్వానికి అసలు సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కీలకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్, సామాజిక ఆధారం, స్థానిక నాయకత్వం ఉందో అంచనా వేసి, అక్కడ ఆ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చే విధానం తెరపైకి వస్తోంది. ఇది కేవలం సీట్ల సర్దుబాటు కాకుండా.. కూటమి ఓటు బ్యాంకును సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నంగా చూడొచ్చు. ఒకే ప్రాంతంలో మిత్రపక్షాలు పరస్పరం పోటీ పడితే అధికార వ్యతిరేక ఓటుతో పాటు కూటమి ఓటు కూడా చీలిపోయే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే అడ్డుకోవడమే సమన్వయ కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు టీడీపీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక ఎన్నికల విషయంలో పార్టీ అంతర్గతంగా ఎలాంటి అసంతృప్తి తలెత్తకుండా చూడాలని చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, ఆశావహులు అసంతృప్తికి గురైతే దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో పడే అవకాశం ఉంది. అందుకే వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూటమి ప్రయోజనాలే ముఖ్యమని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం మరో ఎన్నిక కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ––జనసేన భాగస్వామ్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలపడిందో తేల్చే పరీక్ష కూడా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన ఐక్యతను గ్రామస్థాయి రాజకీయాల్లో కొనసాగించగలిగితే కూటమి మరింత బలపడే అవకాశం ఉంటుంది. అయితే స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత ఆశలు, స్థానిక ఆధిపత్య పోటీలు, టికెట్ల కోసం పోటీ పెరగడం సహజం. ఈ విభేదాలను ఎంత సమర్థంగా పరిష్కరిస్తారన్నదే కూటమి విజయానికి కీలకంగా మారనుంది. మొత్తంగా చంద్రబాబు––పవన్ భేటీని చూస్తే.. స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని స్థానాలు గెలుస్తారనే దానికంటే ముందుగా కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరినొకరు ఎంతవరకు సమన్వయం చేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథగా మారుతోంది. గ్రామస్థాయిలో ఈ సమన్వయం సక్సెస్ అయితే స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమికి మరో పెద్ద రాజకీయ బలంగా మారే అవకాశం ఉంది.

# గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జీఎస్టీ వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. 2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జీఎస్టీ వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జీఎస్టీ వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జీఎస్టీ వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది. ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జీఎస్టీ రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది. ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బంగారాన్ని అమ్మొద్దండి.. ప్రకటనలు చూసి మోసపోకండి




: బంగారం ధరలు ప్రియమవుతాయా? తగ్గుతాయా? ఇదే రకమైన సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి. బంగారం ధరలను చూసి ఇప్పటికే చాలా మందిలో ఆసక్తి పోయింది. అయినా ధరలు ఏ మాత్రం తగ్గినా కొనుగోలు చేయడానికి మాత్రం వెనకాడటం లేదు. పసిడి ధరలు మరింత ప్రియమవుతాయని అంచనాలు నిజమయ్యే టట్లు కనిపిస్తున్నాయి. అలాగే ధరలు తగ్గుతాయన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇందులో ఏది నిజం? ఏది అబద్ధం? అన్నది మాత్రం తేలకుండా ఉంది. గత కొన్నాళ్లుగా దేశంలో బంగారం, వెండి ధరలు అనిశ్చితిలో కొనసాగుతున్నాయి. ఒకరోజు ధరలు పెరగడం, మరొక రోజు ధరలు తగ్గుతుండటం కొంత గందరగోళానికి తావిస్తుంది.

**ఎప్పుడూ ప్రియమే...**

బంగారం అనేది ఎప్పుడూ ప్రియమే. దానిని ఎవరూ కాదనరు. బంగారం ఎప్పుడు కొనాలన్నా అది మనకు భారంగానే కనిపిస్తుంది. కానీ భవిష్యత్ లో అదే భరోసాగా ఉంటుంది. పదేళ్ల క్రితం ఉన్న బంగారం ధరలు, నేటి ధరలతో పోల్చుకుని చూస్తే చాలా మందికి నిద్రపట్టదు. నాడు ఎందుకు పసిడి కొనుగోలు చేయలేకపోయామన్న బాధ, ఆవేదన కనపడుతుంది. అదే పరిస్థితి మరికొన్నాళ్లకు మళ్లీ కనిపించవచ్చు. అందుకే డబ్బులు ఉన్నప్పుడు బంగారం కొనుగోలు చేస్తే అలాంటి బాధ భవిష్యత్ లో ఎవరికీ రాకపోవచ్చు. బంగారం అనేది సుస్థిరమైన పెట్టుబడిగా చూసేవారు సయితం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కొంత ఆలోచనలో పడ్డారు.

**వ్యాపార ప్రకటనలు చూసి...**

తాకట్టు పెట్టడం కంటే.. నగలు అమ్మేయడమే మంచిది.. తాకట్టు పెడితే.. టెన్షన్.. అమ్మితే నే బెటర్ అన్న ప్రచారాలు హోరెత్తిస్తున్నాయి. ఇది కేవలం వ్యాపార ప్రకటనలుగానే చూడొద్దు. రానున్న కాలంలో బంగారం ధరలు భారీగా పెరుగుతాయనడానికి సంకేతాలుగానే చూడాలి. అందుకే పెట్టుబడి పెట్టేవారు కూడా కొంత మొత్తాన్ని బంగారం, వెండిపై పెట్టుబడి పెడుతున్నారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు పెరిగాయి. వెండి ధరలు తగ్గాయి. పది గ్రాముల బంగారం ధరపై వెయ్యి రూపాయలు పెరిగింది. కిలో వెండి ధరపై వంద రూపాయలు తగ్గింది. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,37,710 రూపాయలుగా నమోదయింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,50,230 రూపాయలుగా కొనసాగుతుంది. కిలో వెండి ధర 2,44,900 రూపాయల వద్ద ట్రేడ్ అవుతుంది. మధ్యాహ్నానికి ధరల్లో మార్పులుండవచ్చు. పెరగవచ్చు. తగ్గవచ్చు.

# తిరుమలలో సాధారణంగానే భక్తుల రద్దీ.. స్వామి దర్శనానికి?




తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. గతంతో పోల్చుకుంటే తిరుమలలో ఓ మోస్తారుగా భక్తుల రద్దీకొనసాగుతుంది. నేడు బుధవారం కావడంతో పాటు వరస సెలవులు పూర్తి కావడంతో రద్దీ తగ్గిందని అధికారులు తెలిపారు. తిరిగి శుక్రవారం నుంచి రద్దీ ప్రారంభమయ్యే అవకాశముందని చెబుతున్నారు. నిన్నటి వరకూ పెరటాసి మాసం లో తమిళనాడు నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా చాలా వరకూ తగ్గింది. ఇక దసరా సెలవుల సందర్భంగా భారీ సంఖ్యలో తిరుమలకు భక్తులు తరలి వస్తారని, శ్రీవారి మొక్కులు తీర్చుకుంటారని, అందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

**నేడు ప్రత్యేక ప్రవేశ టోకెన్లు జారీ...**

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు నేడు విడుదల కానున్నాయి. ఆన్ లైన్ లో ఉదయం 10 గం.కు రూ.300 టికెట్ల కోటా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు విడుదలచేయనున్నారు. ఈనెల 12, 13, 14, 19, 20 తేదీల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు జారీ చేయనున్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు కోరుతున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 11 నుంచి 20 వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ముందుగా టిక్కెట్లున్న భక్తులు మాత్రం వచ్చి దర్శనం చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాలినడకన వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

**31 కంపార్ట్ మెంట్స్ లో...**

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 31 కంపార్ట్ మెంట్స్ లో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి సర్వదర్శనం 12 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు రెండు గంటలకు పైగానే సమయం పడుతుంది. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 73,629గా ఉంది. శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తులు 27,525గా ఉంది. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 3.91 లక్షలు జరిగినట్లు అధికారులు తెలిపారు. తిరుమలలో అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులు 1.75 లక్షలుగా ఉంది.

## కూటమి అగ్రనేతలు ఒక్కటయితే సరిపోతుందా?

# కిందిస్థాయిలో ఏకం కావద్దూ?




రాజకీయాల్లో కూటమి అగ్రనేతలు ఒకటైతే సరిపోదు. కిందిస్థాయి క్యాడర్ ఏకం కావడం అత్యంత కీలకం అనేది అక్షరసత్యం. నాయకులు వేదికలపై చేతులు కలిపినంత సులభంగా, క్షేత్రస్థాయిలో పార్టీల కార్యకర్తలు, స్థానిక నాయకులు ఒకతాటిపైకి రావడం జరగదు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ద్వితీయ శ్రేణి నేతలు కాచుక్కూర్చుని ఉన్నారు. వారు చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు రాజీపడి కాలదన్నుకుంటే తాము భవిష్యత్ లో రాజకీయంగా ఎదగలేమన్నది వారి భావన. అందుకే ఈసారి పై స్థాయిలో నేతలు ఒక్కటయి తమకు అన్యాయం చేస్తే ఊరుకునే పరిస్థితులు మాత్రం కనిపించడం లేదు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో మూడు పార్టీలు క్షేత్ర స్థాయిలో నేతల సయోధ్యకు ఇసుమంత కూడా ప్రయత్నించలేదు. వారితో కనీసం మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు వారి సమయం. సీటు వచ్చినా రాకున్నా పోటీ చేసి కూటమి ఓట్లను చీలిస్తే నష్టపోయేది అధికార పార్టీ మాత్రమేనని గుర్తుంచుకోవాలి. అందుకే పై స్థాయిలో మీటింగ్ లు పెట్టుకుంటే సరిపోదు.. కింది స్థాయి నేతలతో సమన్వయం కుదర్చాలి.

**సమన్వయం లేకపోతే...?**

గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరూ రాజకీయాలను దీర్ఘకాలంగా తీసుకోవడం లేదు. ఇప్పుడు కాక ఇంకెప్పుడు? అన్న ధోరణి నేటి నేతలలో నెలకొంది. అదే ఇప్పుడు కూటమి పార్టీలకు ప్రధాన సమస్యగా మారనుంది. కూటమి విజయవంతం కావాలంటే కిందిస్థాయిలో ఎందుకు ఐక్యత అవసరమో, దానికి ఎలాంటి సవాళ్లు ఉంటాయన్నది ముగ్గురు అగ్రనేతలకు తెలుసు. క్షేత్రస్థాయిలో ఉండే సవాళ్లు అనేకం ఉంటాయి. దశాబ్దాలుగా స్థానికంగా ఒకరితో ఒకరు కొట్టుకున్న నాయకులు, కార్యకర్తలు రాత్రికి రాత్రి మిత్రులు కాలేరు. అగ్రనేతలు ఒకటైనా, కిందిస్థాయిలో సమన్వయం లేకపోతే ఒక పార్టీ ఓట్లు మరో పార్టీకి బదిలీ కావు. ఇది కూటమి కొంపముంచుతుంది. ఈ ప్రక్రియ ముందు నుంచి ఉండాలి. ముందు నుంచి పదవులు పంపకాల్లోనూ, వారికి నియోజకవర్గాలలో ప్రాధాన్యత కల్పించడంలోనూ కూటమి పార్టీల నాయకత్వం శ్రద్ధ పెట్టి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదు. ఇప్పటికిప్పుడు ముగ్గురు కలసి కూర్చుని తాము సీట్ల సర్దుబాటు చేసుకున్నామని చెప్పినా సర్దుబాటు కారన్నది అంతే వాస్తవం.

**ఇలా చేస్తేనే...**

కూటమి వల్ల కొన్ని నియోజకవర్గాలను మిత్రపక్షానికి కేటాయించాల్సి వస్తుంది. అప్పుడు అక్కడ దశాబ్దాలుగా పనిచేస్తున్న స్థానిక నేతలకు టికెట్ దక్కక, తిరుగుబాటు చేయడం లేదా లోపాయికారీగా వేరే పార్టీకి సహకరించడం జరుగుతుంది. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో అన్ని మిత్రపక్షాల నాయకులతో ఉమ్మడి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలి. అందరికీ సముచిత స్థానం, నామినేటెడ్ పదవులు దక్కుతాయనే నమ్మకాన్ని అధిష్టానం కిందిస్థాయి నేతల్లో కల్పించాలి. ప్రచార జెండాలు, ఫ్లెక్సీలలో అన్ని పార్టీల సింబల్స్, నేతల బొమ్మలు వాడుతూ కార్యకర్తలు కలిసి తిరిగేలా ప్లాన్ చేసుకోవాలి. నాయకులు కేవలం వ్యూహాలు మాత్రమే రచించగలరు, కానీ పోలింగ్ బూత్ వరకు ఓటర్లను తీసుకెళ్లి ఓట్లు వేయించేది కిందిస్థాయి కార్యకర్తలే. అందువల్ల అగ్రనేతల కలయిక అనేది ఒక ఆరంభం మాత్రమే, అసలైన విజయం కిందిస్థాయి ఐక్యతపైనే ఆధారపడి ఉంటుంది. ఈ వాస్తవాన్ని తెలుసుకుని కూటమి నాయకత్వం ముందుకు అడుగు వేస్తే మంచిది. లేకుంటే కొంపముంచడం ఖాయంగా కనిపిస్తుంది.

# అందని జామ చేదు అనుకోవాల్సిందే... ధరలు ఇంతగా పైకి ఎగబాకడంతో?




జామపండు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో 175 రూపాయల నుంచి రెండు వందల రూపాయల వరకూ విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో కిలో జామకాయలు కేవలం అరవై నుంచి డెబ్బయి రూపాయలు ధర పలికేవి. ఒక దశలో కిలో యాభై రూపాయలకు కూడా విక్రయించారు. కానీ నేడు ఎల్ నినో ప్రభావంతో జామపండు అందకుండా పోయింది. సామాన్యుడికి అందుబాటులో ధరలు లేకపోవడంతో జామ దూరమయింది. జామపండును సాధారణంగా "పేదల యాపిల్" అని పిలుస్తారు, ఎందుకంటే ఇది తక్కువ ధరలో ఎక్కువ పోషకాలను అందిస్తుంది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో జామపండు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

**ధరలు పెరగడానికి ...**

సాధారణంగా అందుబాటులో ఉండే ఈ పండు ధరలు పెరగడం వల్ల సామాన్యులు దీనిని కొనడానికి జంకుతున్నారు. జామపండు ధరలు పెరగడానికి గల కారణాలు ఎల్ నినో ప్రభావంతో దిగుబడి తగ్గడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు లేదా తెగుళ్ల వల్ల జామ తోటల్లో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇంధన ధరల పెరుగుదల వల్ల తోటల నుండి మార్కెట్‌కు పండ్లను తరలించే రవాణా ఖర్చులు పెరిగాయి. ఆరోగ్య స్పృహ పెరగడంతో రోగనిరోధక శక్తిని పెంపొందించే జామపండ్లకు మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగింది.

**జామలోని అద్భుతమైన పోషక విలువలు...**

ధర ఎక్కువైనా, ఆరోగ్య పరంగా జామపండు అందించే ప్రయోజనాలు అమూల్యమైనవని వైద్యులు చెబుతారు.

**విటమిన్ సి :** జామలో నారింజ పండు కంటే 4 రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి అద్భుతంగా పనిచేస్తుంది.

**జీర్ణక్రియకు మేలు :** ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది, జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది.

**మధుమేహ నియంత్రణ :** దీని గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. షుగర్ వ్యాధి ఉన్నవారికి ఇది చాలా మంచిది.

**గుండె ఆరోగ్యం :** ఇందులో ఉండే పొటాషియం, సోడియంలు రక్తపోటును నియంత్రించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. కానీ ధరలు పెరగడంతో సామాన్యులకు జామ దూరం అయింది.

# ఉష్ణోగ్రతలు తగ్గుతాయా? ఉక్కపోత వదులుతుందా?




ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నేడు వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో కొంత వానలు పడతాయని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు కొంత తగ్గుముఖం పట్టే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు అంచనా వేస్తున్నారు. బలమైన ఈదురుగాలులతో కూడిన వానలతో పాటు గంటకు 40నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్టోబరు రెండో వారంలోనూ ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదవుతున్నాయి. ఉక్కపోత ఇబ్బంది పెడుతుంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఎల్ నినో ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాలపై గణనీయంగానే చూపిందనే చెప్పాలి. ఇప్పటికే రెండు ప్రభుత్వాలు కరువు మండాలను ప్రకటించాయి.

**ఏపీలో నేడు తేలిక పాటి వానలు...**

ఆంధ్రప్రదేశ్ లో నేడు కొన్ని చోట్ల తేలికపాటి వానలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశముంది. ఉష్ణోగ్రతలు కొన్ని చోట్ల భారీగ నమోదు కావచ్చు. విజయవాడ లాంటి ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత దాదాపు 34 డిగ్రీల వరకు ఉండొచ్చు, స్వల్పంగా మేఘావృతమై ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక ఉత్తరాంధ్రలో తేలికపాటి వానలు పడతాయని చెప్పింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో తేలికపాటి జల్లులు పడే ఛాన్స్ ఉంది. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ వానలు పడతాయని. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముంది. రాయలసీమలో పొడి వాతావరణం ఉంటుంది.

**తెలంగాణలో నేడు వానలు...**

తెలంగాణలోనూ వానలు కొన్ని చోట్ల పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండి, సాయంత్రానికి వాతావరణం చల్లబడవచ్చు. హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రత దాదాపు 31 నుంచి 33 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. నైరుతి రుతుపవనాలు వెళ్లిపోవడంతో ఇక వానలు పడే ఛాన్స్ లేదు. అయితే ఇప్పుడు వానల కంటే చల్లదనం ఎక్కువ కోరుకుటున్నారు. వాతావరణం కొంత కూల్ అయితే చాలని భావిస్తున్నారు. తెలంగాణలో నేటికీ ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. తెల్లవారు జాముకు కొంత చల్లబడుతుంది. అంతే తప్ప ఉదయం నుంచి రాత్రంతా ఉష్ణోగ్రతలు భారీగానే నమోదవుతుండటం ఆందోళనకు గురి చేస్తుంది. ఎల్ నినో ప్రభావం ఇంత తీవ్రంగా ఉంటుందని ఊహించని ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వాతావరణం మార్పులతో కొంత జ్వరాలతో సతమతమవుతున్నారు. ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడిపోతున్నాయి.



# విద్యుత్ జమ్వాల్ సైలెంట్ సెన్సేషన్!

బాలీవుడ్ యాక్షన్ హీరో విద్యుత్ జమ్వాల్ మరోసారి తన ప్రత్యేకతతో ఆకట్టుకున్నాడు. ముంబైలో జరిగిన హాలీవుడ్ చిత్రం 'స్ట్రీట్ ఫైటర్' ప్రమోషనల్ ఈవెంట్‌లో ఆయన చేసిన విన్యాసం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. వేదికపై ఏకంగా 15 నిమిషాలపాటు ఎలాంటి కదలిక లేకుండా, శ్వాసను నియంత్రిస్తూ విద్యుత్ చేసిన ధ్యానం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. భారతీయ యుద్ధకళ కలరిపయట్టు, యోగా, ప్రాణాయామంపై తనకున్న పట్టును మరోసారి విద్యుత్ ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పాడు. 'ధల్సిమ్' పాత్రకు సంబంధించిన కాస్ట్యూ లుక్‌లతో ఉన్న వారితో కలిసి వేదికపైకి వచ్చిన ఆయన.. ప్రశాంతంగా కూర్చుని 15 నిమిషాలపాటు ప్రాణాయామం, ధ్యానం చేశాడు. హాలీవుడ్‌లో విద్యుత్ నటిస్తున్న తొలి చిత్రం 'స్ట్రీట్ ఫైటర్'. ప్రముఖ వీడియో గేమ్ ఆధారంగా తెరకెక్కుతున్న సినిమాలో ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ అభిమానులకు పరిచయమైన 'ధల్సిమ్' పాత్రలో కనిపించనున్నాడు. యోగాను తన ప్రధాన శక్తిగా ఉపయోగించుకునే ఈ పాత్రకు విద్యుత్ సరిగ్గా సరిపోతాడనే విషయాన్ని ఈ ఈవెంట్ మరోసారి చూపించింది. విద్యుత్ మాట్లాడుతూ.. ప్రాచీన యోగసూత్రాల్లోని ఒక ప్రత్యేకమైన టెక్నిక్‌ను అనుసరించినట్టు తెలిపాడు. శ్వాస నియంత్రణ, ధ్యానం తన జీవితంలో ఎన్నో మానసిక లక్ష్యాలను సాధించేందుకు సహాయపడ్డాయని చెప్పాడు. యువత జీవితంలో ఏదో సాధించాలనే పరుగులో కాసేపు ఆగి ప్రశాంతంగా ఉండటం కూడా నేర్చుకోవాలని సూచించాడు. పారామౌంట్ పిక్చర్స్ నిర్మిస్తున్న 'స్ట్రీట్ ఫైటర్' అక్టోబర్ 16న ఇంగ్లిష్‌తోపాటు హిందీ, తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## మూడేళ్ల తర్వాత..
# వైష్ణవ్ తేజ్ నెక్ట్స్ ఏంటి?

వైష్ణవ్ తేజ్ తన డెబ్యూ మూవీతోనే టాలీవుడ్‌లో సంచలనం సృష్టించాడు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'ఉప్పెన'తో హీరోగా పరిచయమైన వైష్ణవ్.. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి, వైష్ణవ్ తేజ్‌కు మంచి ఓపెనింగ్ ఇచ్చింది. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం 'ఉప్పెన' స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాయి.



'ఉప్పెన' తర్వాత 'కొండపొలం', 'రంగ రంగ వైభవంగా', 'ఆదికేశవ' వంటి చిత్రాల్లో నటించాడు వైష్ణవ్. వీటిలో ఏ సినిమా కూడా అతడి డెబ్యూ మూవీకి వచ్చిన స్థాయి క్రేజ్, విజయాన్ని అందించలేకపోయింది. దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఇప్పటివరకు అతడి తదుపరి ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రాలేదు. దీంతో వైష్ణవ్ నెక్ట్స్ సినిమా ఎప్పుడు? ఎవరితో? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. తాజాగా వైష్ణవ్ తేజ్ తదుపరి సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రముఖ దర్శకుడు పరశురామ్ పెట్ల దర్శకత్వంలో వైష్ణవ్ ఓ సినిమా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. గతంలో పరశురామ్ ఓ ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో.. అదే కథతో వైష్ణవ్‌తో సినిమా చేయబోతున్నారా? లేక ఇది పూర్తిగా కొత్త ప్రాజెక్టా? అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఇది కేవలం ప్రచారం మాత్రమే. అయితే నిజంగానే ఈ కాంబినేషన్ సెట్ అయితే.. 'ఉప్పెన' తర్వాత వైష్ణవ్ తేజ్‌కు మరో మంచి బ్రేక్ దక్కే అవకాశం ఉంటుందనే ఆసక్తి నెలకొంది.

# యువతకు నిర్మాత రవి క్లాస్..

ఇటీవల బాలీవుడ్‌లో సంచలన విజయాన్ని అందుకున్న సినిమాల్లో 'హనుమాన్ అంశ్' ఒకటిగా నిలిచింది. సౌబినా సత్య ప్రధాన పాత్రలో దర్శకుడు విశాల్ చతుర్వేది తెరకెక్కించిన ఈ డివోషనల్ డ్రామా.. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో రూపొందించి భారీ వసూళ్లు సాధించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.420 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టినట్టు చిత్రవర్గాలు చెబుతున్నాయి. హిందీలో మంచి విజయాన్ని అందుకున్న సినిమాను తెలుగులో విడుదల చేసేందుకు కూడా చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.



ఎట్టకేలకు హోంబలే, మైత్రి డిస్ట్రిబ్యూషన్ సంస్థలు కలిసి తెలుగు వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి. అక్టోబర్ 9న సినిమా తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన తెలుగు ప్రెస్‌మీట్‌లో మైత్రి నిర్మాత రవి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుత యువత సోషల్ మీడియాలో వ్యవహరిస్తున్న తీరు,ముఖ్యంగా ఏఐ వినియోగం విషయంలో కొందరు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని సరైన మార్గంలో ఉపయోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో యువతకు 'హనుమాన్ అంశ్' వంటి సినిమాలు అవసరమని రవి అన్నారు.ఈ తరహా కథలను చూడటం ద్వారా యువతలో ఆలోచనా విధానంలో కొంతైనా మార్పు రావచ్చని అభిప్రాయపడ్డారు. వినోదంతో పాటు విలువలు, ఆలోచనను అందించే సినిమాలకు ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఫోటో స్టార్!



పార్వతీ నాయర్

# దశరథుడిగా.. అరుణ్ గోవిల్

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. అయోధ్య రాజు దశరథుడిగా నటిస్తున్న సీనియర్ నటుడు అరుణ్ గోవిల్ ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. రామానంద్ సాగర్ రూపొందించిన ఐకానిక్ టీవీ సీరియల్ 'రామాయణ్'లో శ్రీరాముడిగా నటించి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ గోవిల్.. దశాబ్దాల తర్వాత అదే రామాయణ కథలో మరో కీలక పాత్రలో కనిపించనుండటం విశేషం. ఒకతరం ప్రేక్షకులకు రాముడిగా పరిచయమైన ఆయన.. ఇప్పుడు అదే రామాయణ ప్రపంచంలో అయోధ్య రాజు దశరథుడిగా కనిపించనున్నారు. 'దశరథుడిగా అరుణ్ గోవిల్' అంటూ చిత్రబృందం ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇందులో 68 ఏళ్ల అరుణ్ గోవిల్ రాజసంగా అయోధ్య సింహాసనంపై కూర్చున్నట్లు కనిపిస్తున్నారు. ఆయన లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న సినిమాలో రణ్‌బీర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రంలోని తొలి భాగం నవంబర్ 6న దీపావళి సందర్భంగా విడుదల కానుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ చిత్రం విడుదల కానుంది.



# మాస్ హీరో ట్యాగ్ వద్దు..



'మాస్ హీరో' అనే ముద్ర తనపై ఉండాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని నేచురల్ స్టార్ నాని అన్నారు. 'ది ప్యారడైజ్' విడుదల తర్వాత ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తన సినిమాల ఎంపిక, హీరోలపై ఉండే అంచనాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారీ యాక్షన్, మాస్ కథలనే ఎంచుకోవాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ మాస్ హీరో కావాలని ఆశలు పెట్టుకోలేదు. నా సినిమాల ఎంపికలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 'దసరా' తర్వాత 'హాయ్ నాన్న'లాంటి సింపుల్ సినిమా చేశాను. మాస్ హీరో అనే ట్యాగ్ కోసం ప్రయత్నించే నటులు ప్రతిసారీ భారీ సినిమాలనే ఎంచుకోవాల్సి వస్తుంది.అలాంటి కథలుచేయాలంటే ఒకరకమైన ఒత్తిడి ఉంటుంది" అని నాని చెప్పారు. అంతేకాదు.. మాస్ ఇమేజ్ కోసం నిరంతరం భారీ సినిమాలు చేయాల్సిన పరిస్థితిలో ఉన్న నటులను చూస్తే తనకు జాలేస్తుందని అన్నారు. ప్రేక్షకుల అంచనాలు, మార్కెట్ లెక్కలు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకోవాల్సి రావడంతో.. తమకు నచ్చిన సినిమాలు చేసుకునే స్వేచ్ఛ తగ్గిపోతుందని అభిప్రాయపడ్డా రు. అయితే 'దిప్యారడైజ్'కంటే మరింత భారీ, మాస్ సినిమా చేయాల్సి వస్తే తాను సిద్ధమేనని నాని స్పష్టం చేశారు. అది తనపై ఉన్న ట్యాగ్ కోసం కాదని, కథ డిమాండ్ చేస్తే తప్పకుండా చేస్తానని చెప్పేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం తన కెరీర్ విషయంలో పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని నాని తెలిపారు. ఇంతకంటే పెద్ద స్టార్‌గా మారాలనే కోరిక కూడా తనకు లేదన్నారు. సినిమా విజయాన్ని కేవలం కలెక్షన్లతోనో, 'మాస్', 'క్లాస్' అనే ట్యాగ్‌లతోనో అంచనా వేయలేమని నాని అభిప్రాయపడ్డారు.

# థమన్.. ఏకే డేట్ లీక్!?



విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం'. భారీ అంచనాలతో రూపొందుతున్న సినిమాకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. షూటింగ్ ఇంకా కొంత భాగం పూర్తి కావాల్సి ఉండటంతో.. ముందుగా ప్రకటించిన విడుదల తేదీని మేకర్స్ వాయిదా వేసిన విషయం తెలిసిందే. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని చిత్రబృందం వెల్లడించింది. అయితే మేకర్స్ కంటే ముందే ఈ విషయాన్ని సంగీత దర్శకుడు థమన్ లీక్ చేసినట్టు తెలుస్తోంది. తాజాగా ఆయన సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్‌లో 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు పేర్కొన్నాడు. అయితే ఆ పోస్ట్ కాసేపటికే డిలీట్ కావడం ఆసక్తికరంగా మారింది. తర్వాత థమన్ మరోసారి అదే పోస్టర్‌ను రిలీజ్ చేసినప్పటికీ.. ఈసారి విడుదల తేదీని ప్రస్తావించకుండా కేవలం అక్టోబర్‌ను మాత్రమే సూచించాడు. దీంతో 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30న విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయనే టాక్ సోషల్ మీడియాలో మొదలైంది. థమన్ పొరపాటున రిలీజ్ డేట్‌ను బయటపెట్టాడా? లేక మేకర్స్ నిర్ణయం మారిందా? అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.



# రక్తం పులుపెక్కుతోంది

వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ (సీవో2) మోతాదులు పెరగటం పెద్ద నష్టమే కలిగిస్తోంది. వేడిగాలులు, కరవులు, కార్చిచ్చులు, భీకర తుపాన్ల వంటి పర్యావరణ విపత్తులే కాదు.. ఆరోగ్యానికీ పెను ప్రమాదం తెచ్చిపెడుతోంది. వాతావరణంలోని మార్పులు రక్తంలోనూ రసాయన మార్పులకు కారణమవుతున్నట్టు, ఇది ప్రమాదకర పరిణామాలకు దారితీస్తున్నట్టు ఎయిర్ క్వాలిటీ, అట్మాస్ఫియర్ అండ్ హెల్త్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. కార్బన్ డయాక్సైడ్ మన రక్తంతో ఆడుకోవటం కొత్తేమీ కాదు. ఆదిమ మానవులు ఎదుగుతున్న సమయంలో వాతావరణంలో సీవో2 280 పీపీఎం స్థాయిలో ఉండేది. అంటే ప్రతి పది లక్షల భాగాల్లో ఒక వంతుగా ఉండేదన్నమాట. పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంతవరకూ అలాగే కొనసాగుతూ వచ్చింది కూడా. ఫ్యాక్టరీ గొట్టాల్లోంచి గ్రీన్‌హౌజ్ వాయువులు వెల్లువెత్తటంతో 1900 సంవత్సరం వచ్చేసరికి సీవో2 మోతాదులు 300 పీపీఎంకు, 1980 నాటికి 330 పీపీఎంకు పెరిగాయి. అప్పటి నుంచీ ఎగబాకుతూనే వస్తోంది. ఇప్పుడిది ఏకంగా 425 పీపీఎంకు చేరుకుంది. ఇది మన భూమి ఆరోగ్యానికే కాదు, శరీర ఆరోగ్యానికీ చేటే. మన శరీరాలు అలవడిన మోతాదుకు మించి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకునే స్థితికి చేరుకున్నాం. ఇంటా బయటా మనం పీల్చుకునే ప్రతి శ్వాసతోనూ ఇది పెద్దమొత్తంలో ఒంట్లోకి వెళ్తోంది. దీని ప్రభావాన్ని నిర్ధారించటానికే ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, కర్టిన్ యూనివర్సిటీ పరిశోధకులు దృష్టి సారించారు. మొత్తం 21 ఏళ్ల పాటు సాగిన అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సర్వే వివరాలను క్షుణ్నంగా విశ్లేషించారు. పర్యావరణ కాలుష్య కారకాలకు శరీరం ఎలా స్పందిస్తుందో తెలుసుకోవటానికి ఈ సర్వేలో ప్రతి సంవత్సరం 7000 మంది రక్త నమూనాలను తీసుకున్నారు. రక్తంలో సీవో2 మోతాదులను ప్రతిబింబించే బైకార్బొనేట్ అనే రసాయన సూచిక ఆధారంగా ప్రభావాలను అంచనా వేశారు. మొత్తం సర్వే కాలంలో వాతావరణంలో సీవో2 మోతాదులు 369 పీపీఎం నుంచి 420 పీపీఎంకు ఎగబాకగా.. రక్తంలో బైకార్బొనేట్ మోతాదులు 7% పెరిగినట్టు తేలటం గమనార్హం.

**రక్తం ఆమ్ల పూరితం**

కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకుంటున్నకొద్దీ సముద్రాల్లో ఆమ్లం ఎక్కువవుతుంది. మన రక్తమూ అంతే. ఆమ్లగుణం పెరుగుతుంది. ఇది పెరగకుండా చూడటానికే బైకార్బొనేట్ తోడ్పడుతుంది. ఒకరకంగా దీన్ని కార్బన్ డయాక్సైడ్ 'షాక్ అబ్జార్బర్' అనుకోవచ్చు. ఇది రక్తంలో మితిమీరిన కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించుకుంటుంది. బైకార్బొనేట్ మోతాదులు పెరుగుతున్నాయంటే శరీరం అధిక సీవో2కు మూల్యం చెల్లించుకుంటోందనే అర్థం. సీవో2 మోతాదులు ఒకమాదిరిగా పెరిగినా తలనొప్పి, అలసట, ఏకాగ్రత తగ్గటం, నిర్ణయాలు సరిగా తీసుకోలేకపోవటం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నట్టు స్వల్పకాల అధ్యయనాలు సూచిస్తున్నాయి. జంతువులపై నిర్వహించిన దీర్ఘకాల అధ్యయనాల్లోనైతే మరింత తీవ్ర దుష్ప్రభావాలూ కనిపించాయి. విశృంఖల కణాలను నిర్వీర్యం చేసే సామర్థ్యం సన్నగిల్లటం, కణ అంతర్గత వాపు (ఇన్‌ఫ్లమేషన్).. కిడ్నీ, గుండెలో కణజాలం గట్టిపడటం, ఎముకల మీద ప్రభావాల వంటి వాటికీ దారితీస్తున్నట్టు వెల్లడైంది.

**క్యాల్షియం, ఫాస్ఫరస్ తగ్గుముఖం**

అధిక సీవో2 మూలంగా- ఒకవైపు రక్తంలో బైకార్బొనేట్ మోతాదులు పెరుగుతుంటే.. మరోవైపు క్యాల్షియం, ఫాస్ఫరస్ తగ్గుతుండటం గమనార్హం. రక్తంలో మితిమీరిన కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించుకునే క్రమంలో శరీరం బైకార్బొనేట్‌ను పెద్దమొత్తంలో ఉత్పత్తి చేయటంతో పాటు సీవో2 అణువులను కార్బొనేట్ రూపంలో ఎముకల్లో నిల్వ చేస్తుంటుంది కూడా. ఈ ప్రక్రియకు క్యాల్షియం, ఫాస్ఫరస్ సహకరిస్తుండటం వల్ల అవి రక్తంలోంచి ఎముకల్లోకి చేరుకుంటాయి. దీంతో రక్తంలో వీటి మోతాదులు పడిపోతాయి. ఇదీ శరీర క్రియలను ప్రభావితం చేస్తుంది. క్యాల్షియం పడిపోతే కండరాలు పట్టేయటం, నిస్సత్తువ, వేళ్లు మొద్దుబారటం, సూదులు పొడిచినట్టు అనిపించటం, గుండెలయ అస్తవ్యస్తం కావటం వంటి వాటికి దారితీస్తుంది. ఇక ఫాస్ఫరస్ తగ్గితే బలహీనత, నీరసం, ఆక్సిజన్ సరఫరా తగ్గటం వంటివి తలెత్తుతాయి. మంచి విషయం ఏంటంటే- ఇంకా అలాంటి పరిస్థితి రాకపోవటం. కానీ పరిస్థితి ఇలాగే కొనసాగితే మాత్రం ముందుముందు ప్రమాదం తప్పదు.

**భావి తరాలకు ముప్పు**

ప్రస్తుతం మన శరీరాలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ మోతాదులకు అనుగుణంగా బాగానే సర్దుకుంటున్నాయి. చాలామందిలో పెద్దగా విపరీత లక్షణాలేవీ కనిపించటం లేదు. కానీ రోజురోజుకీ గ్రీన్‌హౌజ్ వాయువులు, ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం మనల్ని ప్రమాదంలోకి నెడుతోంది. భవిష్యత్ తరాలు దీనికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పుడు పుట్టే పిల్లలు మరింత ఎక్కువకాలం అధిక కార్బన్ డయాక్సైడ్ ప్రభావానికి గురవుతారు. గ్రీన్‌హౌజ్ వాయువుల కట్టడిని సమర్థంగా అమలు చేయలేకపోతే శతాబ్దం మధ్యలో సీవో2 మోతాదులు 500 పీపీఎం దాటొచ్చని అంచనా. అప్పుడు రక్తంలో కార్బన్ డయాక్సైడ్ మోతాదులను శరీరం తట్టుకోలేని స్థితికి చేరుకుంటుందని పరిశోధకులు వివరిస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా కళ్లు తెరవటం మంచిదని సూచిస్తున్నారు.

# ఈ అలవాట్లు ఉంటే.. మీకు కచ్చితంగా షుగర్ వస్తుంది




ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఈ ఆధునికి యుగంలో మన ఆహారపు అలవాట్లు మనకు చాలా రోగాలను తెచ్చిపెడుతున్నాయి. అందులో ఎక్కువ మందికి డయాబెటిస్? సమస్య. చాలా మంది డయాబెటిస్ సమస్యతో బాధ పడుతున్నారు. అటువంటి వాళ్లు ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే మంచిది. ఎంత జాగ్రత్తగా ఉంటే ఆరోగ్యం అంత బాగుంటుంది. నిజంగా మనం తీసుకునే ఆహారాన్ని బట్టి మన ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సులో ఆహారపు అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి ఒక్కరి ఆహార అవసరాలు మరియు ప్రాధాన్యతలు భిన్నంగా ఉంటాయి ..మధుమేహం అదుపులో ఉండాలంటే పాటించవలసిన ఆహార నియమాలను ఇప్పుడు చూద్దాం. . .

**అధిక చక్కెర ఎంత హాని తెలుసా**

చక్కెర అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి ప్రయోజనకరమైన ఆహారాల వినియోగం తగ్గిపోతుంది. ఇవన్నీ శరీరానికి అవసరమైన కీలకమైన ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఇతర ముఖ్యమైన పోషకాలకు ముఖ్యమైన మూలాలు. అధిక చక్కెర వినియోగం టైప్ 2 మధుమేహం పెరుగుతుంది.

**ప్రాసెస్ చేయబడిన కార్బోహైడ్రేట్లు**

కార్బొహైడ్రేడ్లు శక్తిని ఇస్తాయి. వీటిని తక్కువ నీటితో జీర్ణం చేసుకోవచ్చు. తెల్ల రొట్టె, తెల్ల బియ్యం పాస్తా శుద్ధి చేసిన ధాన్యాలు సులభంగా జీర్ణమవుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతాయి.

**ఫైబర్ లేకపోవడం**

ఫైబర్ లేకపోవడం వల్ల, శరీరంలో అనేక రకాల సమస్యలు పెరుగుతాయి. ఎందుకంటే ఫైబర్ తగినంత మొత్తంలో తీసుకోకపోతే, ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలతో పాటు డయాబెటిక్ కూడా పెరుగుతుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు , చిక్కుడులో ఫైబర్ అధికంగా ఉంటుంది. డైటరీ ఫైబర్ లేని ఆహారం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థిరంగా ఉండదు, దీని వలన ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది . రక్తంలో చక్కెర స్థాయిలు ఫైబర్ ద్వారా బాగా నియంత్రించబడతాయి.

**అనారోగ్య కొవ్వులు**

కొవ్వు ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వృద్ధి చెందుతుంది. ప్రాసెస్ చేయబడిన , వేయించిన ఆహార పదార్థాలతో పాటు పాల ఉత్పత్తులలో అధిక కొవ్వు ఉంటుంది. వీటిని తీసుకోవం వల్ల ఊబకాయం పెరిగి.. ఇన్సులిన్ తగ్గుతుంది.

**అతిగా తినడం**

క్రమం తప్పకుండా అధికంగా తినడం వల్ల బరువు పెరుగుట మరియు ఊబకాయం ఏర్పడుతుంది., ఇది టైప్ 2 డయాబెటిస్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాలు.

**భోజనం వేళలు పాటించకపోవడం**

భోజన వేళలు కూడా పాటించాలి. ఆహారపు అలవాట్లు మారితే రక్తంలో చక్కెర నియంత్రణను దెబ్బతీస్తుంది.

మీరు ఆకలితో అలమటిస్తున్న సందర్భంలో మానసిక కల్లోలం మరియు చికాకు కలిగించే వైఖరి చాలా సాధారణం. మీ శరీరంలో బ్లడ్ షుగర్ స్థాయి తక్కువగా ఉండటం వల్ల, మీరు త్వరగా చికాకు పడతారు. మీరు దీన్ని అలవాటు చేసుకుంటే లక్షణాలు తీవ్రమవుతాయి. మీరు మరింత ఒత్తిడికి గురవుతారు మరియు నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటారు

**ఫాస్ట్ ఫుడ్స్**

ఫాస్ట్ ఫుడ్స్ తరచుగా తీసుకోవడం వల్ల బరువు పెరగడంతో పాటు , ఇన్సులిన్ తగ్గిపోతుంది. దీని వలన మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది, వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు, సోడియం అధికంగా ఉంటాయి.

# మహిళల్లోనే కిడ్నీ సమస్యలు ఎక్కువ.. ఎందుకని?

**ఎక్కువ మందిలో కిడ్నీల్లో రాళ్లు**

**యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, క్రానిక్ కిడ్నీ డిసీజ్**

**సకాలంలో చికిత్స తీసుకోకపోతే కిడ్నీలు డ్యామేజ్**

కిడ్నీ సమస్యలు, ముఖ్యంగా 30 ఏళ్లకే మహిళల్లో పెరిగిపోతున్నాయి. దీనిపై ఆందోళన కూడా వ్యక్తం అవుతోంది. మహిళల్లో కిడ్నీ సమస్యలు పెరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం.

**కిడ్నీల్లో రాళ్లు**

కిడ్నీలో రాళ్లు ఏర్పడే సమస్య ఎక్కువ మంది మహిళల్లో కనిపిస్తుంది. హార్మోన్లలో ఏర్పడే మార్పులు, ఆహార అలవాట్లు, జన్యువుల స్థితి కిడ్నీలో రాళ్లకు కారణం కావచ్చు. నడుము భాగంలో ఒకవైపు నొప్పి వస్తుంది. లేదంటే కడుపులోనూ రావచ్చు. మూత్రంలో రక్తం పడడం, తరచూ మూత్ర విసర్జన ఇవన్నీ సంకేతాలుగా భావించాలి. దీనికి నివారణగా తగినంత నీటిని తాగాలి. పోషకాహారం తీసుకోవాలి. మధుమేహం, స్థూలకాయం కూడా కిడ్నీల్లో రాళ్ల సమస్యకు దారితీస్తాయి.

**యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్**

మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. దీనికి సకాలంలో చికిత్స తీసుకోకపోతే కిడ్నీలు దెబ్బతింటాయి. బ్యాక్టీరియా మూత్రాశయంలోకి ప్రవేశించినప్పుడు ఇన్ఫెక్షన్ వస్తుంది. మూత్ర విసర్జన సమయంలో, ఆ తర్వాత మంట అనిపిస్తుంది. జననాంగాలపై నొప్పి వస్తుంది. ఆలస్యం చేయకుండా చికిత్స తీసుకోవాలి.

**పాలీ సిస్టిక్ కిడ్నీ డిసీజ్**

ఇది జన్యుపరంగా వచ్చే సమస్య. కిడ్నీలో ఎన్నో సిస్ట్ లు ఏర్పడతాయి. స్త్రీ, పురుషులు ఇద్దరిలోనూ సమస్య రావచ్చు. కడుపులో నొప్పి, అధిక రక్తపోటు, మూత్రంలో మంట ఈ సమస్యకు సంకేతాలు. చికిత్స తీసుకోకపోతే కిడ్నీలు దెబ్బతింటాయి.

**క్రానిక్ కిడ్నీ డిసీజ్**

ఇది చాలా తీవ్రమైన సమస్యే. నిర్ణీత కాలంలో కిడ్నీల పనితీరును మార్చేస్తుంది. మధుమేహం, అధిక రక్తపోటు, వ్యాధి నిరోధక శక్తి సమస్యలు క్రానిక్ కిడ్నీ డిసీజ్ కు దారితీస్తాయి. హార్మోన్లలో మార్పుల వల్ల కూడా సమస్య రావచ్చు.

**ప్రధాన రిస్క్ లు**

రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వీటివల్ల కిడ్నీల్లో సమస్యలు కనిపిస్తాయి. కనుక ప్రతి ఒక్కరూ వీటిని నియంత్రించుకోవడం అవసరం. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి. పోషకాహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.



# 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్

- 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని ఇప్పటికే ప్రకటించిన కోహ్లీ
- అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చన్న పనేసర్
- విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉందని వ్యాఖ్య
- అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని తనకు అనిపించడం లేదన్న పనేసర్
- రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని ప్రశంస



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు.

మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్: శ్రేయస్‌కు కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్.. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు

- వెస్టిండీస్‌పై సెంచరీతో టీ20 ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి శ్రేయస్
- టీ20 టాప్-10లో ఇషాన్, అభిషేక్, శ్రేయస్, తిలక్ వర్మ
- డబుల్ సెంచరీతో వన్డేల్లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న శుభ్‌మన్ గిల్
- వన్డే బ్యాటింగ్ టాప్-10లోకి తిరిగి ప్రవేశించిన కేఎల్ రాహుల్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు.

నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం.

**అగ్రస్థానంలో గిల్ పదిలం**

మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు.

**మళ్లీ నం.01 స్థానానికి రషీద్ ఖాన్**

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

# 2036 ఒలింపిక్స్‌పై భారత్ మాస్టర్ ప్లాన్.. అహ్మదాబాద్ నుంచి బిడ్ ప్రక్రియ షురూ!

2036 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడల ఆతిథ్య వేదికను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా.. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (xూజ) ప్రకటించిన నగరాలు, దేశాల జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (xూూ) సాదరంగా స్వాగతించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ (ూఎఝఝు) కేంద్రంగా భారత్ తన ఒలింపిక్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తోంది. గత 18 నెలలుగా ఐఓసీతో జరిపిన నిరంతర సంప్రదింపుల ద్వారా ఈ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

**రైజింగ్ టు గెదర్ నినాదంతో ముందుకు..**

భారతదేశం ఎంచుకున్న రైజింగ్ టుగెదర్ దృక్పథం.. క్రీడల ద్వారా దేశం రూపాంతరం చెందడం, ఒలింపిక్ ఉద్యమ భవిష్యత్తు కలిసికట్టుగా కొనసాగాలనే నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం కేవలం ఒక గ్లోబల్ ఈవెంట్‌ను నిర్వహించడమే కాకుండా, క్రీడలను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడానికి ఒక చారిత్రక అవకాశం. కోట్లాది మంది యువతను కేవలం క్రీడలను వీక్షించే స్థాయి నుంచి వాటిని ఆచరించే స్థాయికి తీసుకెళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం.

**ఒలింపిక్ ఉద్యమానికి నూతన శకం**

ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా, అత్యుత్తమ డిజిటల్ నెట్‌వర్క్ కలిగిన భారత్‌కు ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే అది ఒలింపిక్ ఉద్యమానికి ఒక కొత్త శకం అవుతుందని ఐఓసీ భావిస్తోంది. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలోకి ఒలింపిక్స్ ప్రవేశించడం వల్ల కొత్త అథ్లెట్లు, కొత్త ప్రేక్షకులు, కొత్త భాగస్వాములు ఒలింపిక్ కుటుంబానికి లభిస్తారు. భారతదేశం యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ వేడుక ప్రపంచానికి చాటిచెప్పనుంది.

**పీటీ ఉష, మన్సుఖ్ మాండవ్య హర్షం:**

ఐఓఏ అధ్యక్షుడు పీటీ ఉష మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ కంటున్న కలలను ఐఓసీ గుర్తించడం మాకు అత్యంత గర్వకారణం. రైజింగ్ టు గెదర్ అనేది కేవలం నినాదం కాదు, అంకితభావంతో కూడిన శక్తి.. అక్టోబర్ చివరి వరకు ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు మా ఆశయాలను ప్రదర్శించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవ్య మాట్లాడుతూ.. క్రీడలు మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలవు.. ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా మిలియన్ల మంది యువతను క్రీడల వైపు ప్రోత్సహించవచ్చు.. దేశంలో ప్రతి సామాజిక వర్గానికి క్రీడా పరివర్తనను తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. త్వరలోనే ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ఎదుట భారత్ తన అధికారిక ప్రణాళికను ప్రదర్శించనుంది.

# ఆ విషయంలో జక్కన్న కంటే సుకుమార్ ఉత్తమంగా!

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు. అయితే దర్శకుడిగా వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న రాజమౌళి సమర్పకుడిగా , ప్రొడ్యూసర్‌గా వస్తున్న సినిమాల విషయంలో మాత్రం అనుకున్న స్థాయిలో మ్యాజిక్ రిపీట్ చేయలేకపోతున్నారనే చర్చ సినీ వర్గాల్లో గట్టిగా నడుస్తోంది. తాజాగా ఆయన సమర్పణలో ఫహద్ ఫాసిల్ కథానాయకుడిగా రూపొందిన -డోంట్ ట్రబుల్ ది ట్రబుల్- సైతం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. గతాన్ని పరిశీలిస్తే రాజమౌళి సమర్పణ తోడైన చిత్రాల్లో -విశాఖ ఎక్స్‌ప్రెస్-, -రాజన్న-, -అందాల రాక్షసి-, -బ్రహ్మాస్త్ర- (తెలుగు వెర్షన్) వంటి సినిమాలున్నా? ఇవేవీ బాక్సాఫీస్ వద్ద పెద్ద సంచలనాలు నమోదు చేయలేకపోయాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ వల్ల ప్రారంభ వసూళ్లు లభించినా? కంటెంట్ పరంగా ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇదే కోవలో సొంత బ్యానర్ -సుకుమార్ రైటింగ్స్- ద్వారా సినిమాలను నిర్మిస్తున్న మరో దిగ్గజ దర్శకుడు సుకుమార్ మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో దూసుకుపోతున్నారు.







సుకుమార్ నిర్మాతగానే కాకుండా శిష్యులకు, యువ దర్శకులకు అవకాశాలు ఇస్తూ కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. -కుమారి 21ఎఫ్- మొదలైన విజయయాత్ర -ఉప్పెన-, -విరూపాక్ష- వంటి భారీ బ్లాక్‌బస్టర్ల వరకు నిరాటంకంగా కొనసాగింది. స్క్రిప్ట్ ఎంపిక చేయడం, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో సుకుమార్ తీసుకునే జాగ్రత్తలే ఆయన బ్యానర్‌ను సక్సెస్ రూట్‌లో ఉంచాయన్నది కాదనలేని నిజం. దర్శకుడిగా రాజమౌళి శిఖరాగ్రాన ఉన్నా? సమర్పకుడిగా.. నిర్మాతగా కంటెంట్ ఎంపిక, సక్సెస్ రేట్ విషయంలో మాత్రం జక్కన్న కంటే సుకుమారే మెరుగైన స్థానంలో ఉన్నార నడంలో సందేహం లేదు. ప్రత్యేకించి సుకుమార్ శిష్యులు గొప్ప దర్శకులుగా ఎదుగుతున్నారు. అతడి కాంపౌండ్ నుంచి వచ్చిన వారంతో సోంతంగా సినిమాలు చేస్తున్నారు. వాటికి సుకుమార్ ఏదో రూపంలో సహకారం అంది స్తున్నారు. కానీ ఇంత వరకూ రాజమౌళి స్కూల్ నుంచి బయటకు వచ్చి సక్సెస్ అయిన దర్శకులు లేరు. జక్కన్న వద్ద చాలా మంది పనిచేసారు. కానీ వాళ్లెవ్వరు సక్సెస్ అవ్వలేదు. తన అసిస్టెంట్..అసోసియేట్ దర్శకుల గురించి రాజమౌళి ఫోకస్డ్ గా చెప్పింది కూడా పెద్దగా లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965